RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :32 బుధవారం 29 ఏప్రిల్ 2026 పేజీలు -8 వెల రూ 5-00

## లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ పర్యాటక శాఖలో కొలువులు



**హైదరాబాద్, ఏప్రిల్ 28:** లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ముగింపు దశకు చేరుకున్నాయి. పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో వారికి ఉద్యోగాలు కల్పించింది. వారంతా భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించనున్నారు. అందుకోసం - మిగతా5లో

రిపోర్టర్లు కావలెను

ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను

సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.

ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు
వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## ప్రభుత్వం కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పవా?

**ఒక్కో విద్యార్థికి రూ.లక్ష వరకు ఖర్చు:సీఎం రేవంత్**



**హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు స్కూళ్లు ఎందుకు గొప్ప అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సర్కార్ బడిలో ఒక్కో విద్యార్థికి రూ. లక్ష వరకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు స్కూల్లో మాత్రం రూ. 25 వేలే ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50వేలకు పైగా నియామకాలు చేపట్టాం. ఉద్యోగ నియామకాలకు సంబంధించి కోర్టుల్లో ఉన్న చిక్కుముళ్లు విప్పుతూ సమస్యలు పరిష్కరించాం. గతంలో సంతలో సరకులా ప్రశ్నపత్రాలు అమ్మారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉందని పెద్దలు చెప్పారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 25 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. 11వేల ప్రైవేటు పాఠశాలల్లో 36.7లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పవా? ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు రూ.25వేల వరకు ఖర్చవుతుంటే, ప్రభుత్వ బడుల్లో రూ. లక్ష వరకు ఖర్చవుతోంది. విద్యార్థుల భవిష్యత్తును విద్యాశాఖ తీర్చిదిద్దాలి. గతంలో విద్యాశాఖ నిర్లక్ష్యానికి గురైంది. విద్యాశాఖను ప్రక్షాళన చేసి ప్రభుత్వం అండగా ఉంది. విద్యకు ప్రాధాన్యం ఇచ్చి విద్యాశాఖకు రూ.21,650 కోట్లు కేటాయించాం అని సీఎం వివరించారు.

## శబరిమల కేసులో కీలక మలుపు..

**సుప్రీం కోర్టులో వాడీవేడిగా వాదనలు**



**ఇంటర్నెట్ డెస్క్:** శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశం, ఇతర మతపరమైన ఆచారాలపై దాఖలైన రివ్యూ పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదనలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల భారీ రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణను చేపట్టింది. ఈ సందర్భంగా రాజ్యాంగ నైతికత, మతపరమైన విశ్వాసాల మధ్య జరుగుతున్న చర్చ దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు ధర్మాసనం ఒక కీలకమైన అంశాన్ని స్పష్టం చేసింది. తాము కేవలం రాజ్యాంగపరమైన ప్రశ్నలపై మాత్రమే దృష్టి పెడుతున్నామని, వ్యక్తిగత ఆలయాల - మిగతా5లో

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలి

**రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్:** గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలనీ, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి అధికారులు ఆదేశించారు.మంగళవారం వరిధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వివిధ అంశాలపై కరీంనగర్ జిల్లా సైదాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా, మండల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు జిల్లా మండల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కలెక్టర్ తో పాటు అధికారులకు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతూ. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఇందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించాలని ధాన్యం కొనుగోలు జరిగిన వెంటనే పేమెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలన్నారు. మొదటి విడత లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ఇండ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పూర్తయిన ఇండ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి మంజూరైన వివిధ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పైపులైన్ పనులు ట్యాంక్ మరమ్మత్తులు లీకేజీలు పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు - మిగతా5లో

## తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్

**హైదరాబాద్, ఏప్రిల్ 28:** తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన డీజీపీగా ప్రమోషన్ పొందనున్నారు. ఈ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ నియామకం అమల్లోకి వస్తుంది. తెలంగాణ ప్రస్తుత డీజీపీ కె. శివధర్ రెడ్డి ఏప్రిల్ 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ



నేపథ్యంలో తెలంగాణ పోలీస్ బాస్‌గా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఏప్రిల్ నెలాఖరులో ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవి విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త డీజీపీ ఎంపిక అనివార్యమైంది. అందుకు రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు జాబితాను ఇటీవల యూపీఎస్సీ.. రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన శిఖా గోయల్, వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా ఉన్నారు. వారిలో సీనియర్ సీవీ ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీగా ఎంపిక చేసింది.

## ఖజానా నింపేదెలా..



**హైదరాబాద్, ఏప్రిల్ 28:** తెలంగాణ ఖజానాను నింపే మార్గాలను అన్వేషించేందుకు ఏర్పాటైన 'రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్' సబ్‌కమిటీ పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఫైళ్లు కదలడం, సమావేశాలు జరగడం వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని, క్షేత్రస్థాయిలో ఆదాయం పెరిగినప్పుడే ఆ కమిటీ ఉనికికి సార్థకత ఉంటుందని ఆయన కుండబద్దలు కొట్టారు. అధికారుల తీరుపై సీఎం అసహనం వ్యక్తం చేస్తూ, పరిపాలనలో వేగం పెంచాలని హెచ్చరించారు.ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఆర్థిక వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, ఇందుకోసం మంత్రుల నేతృత్వంలో సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు. అయితే, ఈ కమిటీ పలుమార్లు భేటీ అయినప్పటికీ, ఆదాయాన్ని పెంచే దిశగా ఇప్పటివరకు ఎలాంటి విప్లవాత్మకమైన లేదా స్పష్టమైన ప్రతిపాదనలు ముందుకు రాలేదు. దీనిపై సీఎం మండిపడ్డారు. సమావేశాలు నిర్వహించడం ముఖ్యం కాదని, ఆ సమావేశాల ద్వారా ఖజానాకు ఎంత ఆదాయం సమకూరిందో లెక్కలు చూపాలని అధికారులను నిలదీశారు. కేవలం అంకెలు, అంచనాలకే పరిమితం కాకుండా, ఆదాయ మార్గాలను అన్వేషించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అత్యంత కీలక దశలో ఉంది. అందుకు తగ్గట్టుగా ఆదాయ వనరులు పెరగకపోవడం పట్ల సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే, సంక్షేమ పథకాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని - మిగతా5లో

## అన్నీ రద్దు చేసి పడేసిన బాస్

**హైదరాబాద్, ఏప్రిల్ 28:** టీవల జగిత్యాలలో సభ నిర్వహించిన తర్వాత.. కొద్దిరోజులపాటు వ్యవసాయ క్షేత్రానికి పరిమితమైన భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్ బయటికి వచ్చారు. సోమవారం భారత రాష్ట్ర సమితి వ్యవస్థాపక దినాన్ని పురస్కరించుకొని ఆయన.. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ పార్టీ




ప్రక్షాళనకు నడుం బిగించారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా సరే అధికారాన్ని దక్కించుకుంటామని చెబుతున్న కేసీఆర్.. దానికి అనుసరించాల్సిన విధానాలలో ఆయన ఇప్పటినుంచే అమలు చేయాలని పార్టీ కార్యకర్తలకు హిత బోధ చేశారు.పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో - మిగతా5లో

## దేశ వైద్య రంగంలో తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్:** దేశంలోని వైద్య రంగంలో 50 శాతానికి పైగా సేవలు తెలంగాణ నుంచి అందించాలన్న లక్ష్యంతో రాష్ట్రంలోని ఆసుపత్రులు మరింత అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన విధానపరమైన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. వైద్య రంగం అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేసిన అపోలో హాస్పిటల్ ను మంత్రి దామోదర రాజనర్సింహ తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి తో పాటు యాజమాన్యాన్ని ముఖ్యమంత్రి అభినందించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.మెడికల్ టూరిజం కోసం ఇప్పటి వరకు ప్రత్యేక పాలసీ లేకపోయినా తమ ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకొచ్చిందని తెలిపారు. వైద్య రంగ అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. మెడికల్ టూరిజం మరింతగా వృద్ధి చెందేందుకు పశ్చిమాసియా దేశాలతో నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించాలంటూ ప్రధానమంత్రి పౌర విమానయాన శాఖ మంత్రిని కోరినట్లు వెల్లడించారు.దేశంలో 50 శాతానికి పైగా వైద్య సౌకర్యాలు తెలంగాణ నుంచే



అందేలా ఎలాంటి లోపాలు లేకుండా విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీతా రెడ్డి,శోభనా కామినేని, ఉపాసన కొణిదెల పాటు ఇతర యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

## మా ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు.. రిటైర్డైనా వదిలిపెట్టం

**: ఐపీఎస్ అధికారులకు హరీశ్ రావు వార్నింగ్**

**బీఆర్ఎస్ నేతల ఫోన్లు, ఇంటి ముందు కెమెరాలను హ్యాక్ చేస్తున్నారన్న హరీశ్**

**బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను రప్పించారని ఆరోపణ**

**రాబోయేది తమ ప్రభుత్వమేనని వార్నింగ్**

బీఆర్ఎస్ అగ్ర నాయకులతో పాటు ఎమ్మెల్యేల ఫోన్లను, వారి ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను ప్రైవేట్ హ్యాకర్ల ద్వారా కొందరు ఐపీఎస్ అధికారులు హ్యాక్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కొందరు ఐపీఎస్ అధికారులు బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను రప్పించి తమ వ్యక్తిగత సంభాషణలు, సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్నారని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు రిటైర్ అయినా వదిలిపెట్టమని, రాబోయేది తమ ప్రభుత్వమేనని హెచ్చరించారు. బాధ్యులైన వారు సొంత ఖర్చులతో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌తో పాటు ఇతర నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ



వేధిస్తోందని ధ్వజమెత్తారు. బెయిల్ వచ్చే సమయంలో పీటీ వారెంట్లు తెచ్చి మరీ జైల్లో ఉంచుతున్నారని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ మోసం చేసిందని, ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగ్గొట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

## సంపాదకీయం

# బీజేపికి రాహుల్ బలం

జాతీయ రాజకీయాల్లో శతాబ్ద కాలం పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుత మోదీ శకాన్ని ఎదుర్కోవడంలో అనుసరిస్తున్న వ్యూహాలు ఆ పార్టీని మరింత ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడలను దీటుగా ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమవుతోంది. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా, దానికి నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపాల్సింది పోయి.. గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోదీ పరిపాలనపై చర్చించకుండా కేవలం ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ప్రతికూలత పెరుగుతోంది. "గతంలో 'మౌత్ కా సౌదాగర్' నుంచి మొన్నటి 'చౌకీదార్ చోర్ హై' వరకు, ఇప్పుడు ప్రధానిని 'టెర్రరిస్టు' అంటూ సంబోధించే స్థాయికి కాంగ్రెస్ నేతలు దిగజారడం ఆ పార్టీకే నష్టం చేకూరుస్తోంది. ఒక దేశ ప్రధానిని అప్రజాస్వామిక పదజాలంతో దూషించిన ప్రతిసారీ మోదీ దానిని అస్త్రంగా మార్చుకుని ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందుతున్నారు. కాంగ్రెస్ ఉక్రోశం నుంచి పుట్టుకొస్తున్న ఇటువంటి వ్యాఖ్యలు రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వాన్ని మరింత బలహీనంగా చూపిస్తున్నాయి. జాతీయ భావాలు బలంగా ఉన్న ఈ రోజుల్లో, ప్రధానిని ఉగ్రవాదితో పోల్చడం సామాన్య ఓటర్లకు మింగుడుపడటం లేదు.కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఏ సిద్ధాంతంపై నడుస్తోంది? ఏ వర్గాల కోసం పోరాడుతోంది? అనే విషయంలో ప్రజలకే కాదు, ఆ పార్టీ శ్రేణులకు కూడా స్పష్టత లేదు. బీజేపీ హిందుత్వ కార్డును ఎదుర్కోవడానికి సాఫ్ట్ హిందుత్వ ను అనుసరించాలా లేక సెక్యులరిజం వైపు ఉండాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం కుప్పకూలుతున్నా, అగ్ర నాయకత్వం కేవలం ఢిల్లీలో కూర్చుని సోషల్ మీడియా వార్లకే పరిమితమవుతోంది. ఈ చేతకాని రాజకీయాల వల్ల రాహుల్ గాంధీ ఇమేజ్ బిల్డప్ అవ్వడం కంటే, మరింత చులకన అవుతోంది.జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా నిలబడాల్సిన కాంగ్రెస్, రోజురోజుకూ ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే స్థితికి చేరుకుంది. 2029 సార్వత్రిక ఎన్నికల ముందు మహిళా రిజర్వేషన్ బిల్లుతో సహా లోక్‌సభ సీట్లను పెంచాలనే బీజేపీ కలకు బ్రేక్ పడింది. లోక్‌సభలో శుక్రవారం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దీంతో మహిళా బిల్లుతో సహా మరో బిల్లును కేంద్రం ఉపసంహరించుకుంది. 2/3 వంతు మద్దతును ఎన్డీయే ప్రభుత్వం కూడగట్టలేకపోయింది. బయట నుంచి చూస్తే ఇది బీజేపీకి ఘోర పరాజయంగా కనిపించవచ్చు, కానీ రాజకీయంగా ఇది బీజేపీకి విజయమే అని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ మొత్తం ఎపిసోడ్‌లో "ఓడిపోయి బీజేపీ గెలిచింది. గెలిచి కాంగ్రెస్ ఓడిపోయింది" అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓట్లు పడిన తర్వాత, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ.. ఒక చారిత్రాత్మక బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని విమర్శించారు. మహిళా బిల్లును అడ్డుకున్నారని మండిపడ్డారు. అయితే, తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.బీజేపీకి సంఖ్యా బలం లేదని ముందే తెలుసు. కానీ ప్రతిపక్షాల నుంచి మద్దతు వస్తుందని ఊహించారు. ఒక వేళ ఓడిపోతే ప్లాన్-బికి కూడా బీజేపీ సిద్ధంగా ఉంది. ఇప్పుడు గెలిచినా, ఓడినా క్రెడిట్ మొత్తం బీజేపీ ఖాతాలోకే వెళ్లినట్లయింది. "మహిళా రిజర్వేషన్లకు ప్రతిపక్షాలు, కాంగ్రెస్ వ్యతిరేకం" అని బీజేపీ ఒక రాజకీయ నినాదాన్ని సృష్టించబోతోంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికల ముందు ఇది ఎంతో కొంత ప్రభావం చూపించే అంశంగా మారింది. గురువారం లోక్‌సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఈ బిల్లును వ్యతిరేకించే వారిని దేశంలో మహిళలు క్షమించరని చెప్పారు.ఇక ఇప్పటి నుంచి ప్రతిపక్షాలను ముఖ్యంగా కాంగ్రెస్‌పై బీజేపీ విరుచుకుపడుతుంది. కాంగ్రెస్, ఇండీ కూటమి బిల్లుకు వ్యతిరేకమనే ఒక వాదనను ప్రజల్లోకి తీసుకెళుంది. 2010లో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించి సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీలు రాజకీయంగా కొంత కాలం దెబ్బతిన్నాయి. 2010లో అప్పటి మన్మోహన్ సింగ్ సర్కార్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును తీసుకువచ్చింది. ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లు వ్యతిరేకించారు.ప్రతిపక్షాలు బీజేపీ ప్రవేశపెడుతున్న బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమని, దేశ రాజకీయ స్వరూపాన్ని మార్చే కుట్ర అని రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాదిస్తున్నారు. వీటన్నింటిని పక్కన పెట్టి బీజేపీ మాత్రం కాంగ్రెస్ మహిళా వ్యతిరేకమనే నేరెటివ్‌ను తయారు చేస్తుంది. మొత్తానికి బీజేపీ బిల్లుల విషయంలో ఓడిపోయినప్పటికీ, రాజకీయ వ్యూహాల్లో మాత్రం గెలిచిందని చెబుతున్నారు.

# హనుమకొండలో.. చలివేంద్రం, అన్నప్రసాద వితరణ

## ఏబీపీపీ ఆధ్వర్యంలో దాహార్తిని తీర్చే కార్యక్రమం ప్రారంభం








**హనుమకొండ, అక్షర సవాల్:** అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కేయూసీ జంక్షన్ ఎక్స్ రోడ్ వద్ద చలివేంద్రం మరియు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని గంగు మణికంఠ శర్మ ఘనంగా ప్రారంభించారు. జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాసు గారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేయి స్తంభాల ఆలయ వేద పండితులు గంగు మణికంఠ శర్మ హాజరై జల ప్రసాద వితరణను, అన్న దాన వితరణ ను ప్రారంభించారు.

**వేసవిలో గొప్ప కార్యం:**

ఈ సందర్భంగా గంగు మణికంఠ శర్మ మాట్లాడుతూ, వేసవికాలంలో దాహార్తిని తీర్చే ఇలాంటి గొప్ప కార్యాన్ని నిర్వర్తించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ప్రతి నెల అయ్యప్ప జన్మదినం సందర్భంగా ఉత్తర నక్షత్రంలో కేయూసీ జంక్షన్‌లో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించాలనే సంకల్పం ఎంతో గొప్పదని కొనియాడారు. తనను ఆహ్వానించిన ఏబీఏపీ జిల్లా కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

**పాల్గొన్న ప్రముఖులు:**

ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రెటరీ దూశెట్టి భాస్కర్, స్టేట్ జోనల్ సెక్రెటరీ కంకట సాగర్ గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బయాన సంతోష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారపు బాలరాజు, జిల్లా కోశాధికారి ఇనుగాల సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, జిల్లా పీఆర్ఓ ఆగపాటి అజయ్, జిల్లా వాలంటరీ కమాండర్ కే ప్రమోద్ పాల్గొన్నారు. అలాగే జిల్లా కమిటీ సభ్యులు పసులేటి జితేందర్, కొండ శ్రీనివాస్, బాదావత్ బాలాజీ, నరసయ్య, మధు, కాంతారావు, అయ్యప్ప వేణుగోపాల్ స్వామి, శ్యాం, జోగుల శ్రీకాంత్, చిదిరం శ్రీధర్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన దాతలందరికీ ఏబీఏపీ తరపున నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# భారీగా పెరుగుతున్న బిలీయనీర్లు

**ముంబై, ఏప్రిల్ 28:** ప్రపంచంలోనే అధికంగా జనాభా ఉన్న దేశం.. మేధస్సుపరంగా అత్యంత విలువైన యువత ఉన్న దేశం.. వనరులపరంగా.. సాంస్కృతిక వైవిధ్యం పరంగా ప్రపంచానికే పాఠాలు చెప్పే దేశం.. భిన్న వాతావరణాలు.. భిన్న సంస్కృతులు.. భిన్నమైన ప్రజలతో అలరారే దేశం.. ఇంతటి విశేషణం.. విశ్లేషణం కేవలం మన దేశానికి మాత్రమే సొంతం. అందువల్లే ప్రపంచానికి భారత్ ఒక మార్గదర్శి.. దిక్సూచి.ఇంతటి స్థాయిలో అనుకూలతలు ఉన్నప్పటికీ భారతదేశన్ని ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశమనే అంటుంటారు. దీనికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. అవి ఎలా ఉన్నప్పటికీ.. భారత్ గొప్ప దేశం. శాస్త్ర సాంకేతికతలనుంచి మొదలుపెడితే.. వ్యవసాయం వరకు భారత్ ఇప్పటికీ తన విభిన్న తత్వాన్ని నిరూపించుకుంటూనే ఉంటుంది.అవినీతి, ఇతర వ్యవహారాల వల్ల ఇప్పటికి అభివృద్ధి చెందుతున్న దేశం గానే భారత్ ఉండిపోతోంది. అయినప్పటికీ మన దేశంలో శ్రీమంతుల సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా నైట్ ఫ్రాంక్ అనే సంస్థ మనదేశంలో ఉన్న ఆగర్భ శ్రీమంతుల సంఖ్యను లెక్క కట్టింది. 2031 నాటికి మనదేశంలో 313 మంది బిలియనీర్లు ఉంటారని పేర్కొంది. ఈ జాబితాలో ఒక్కో వ్యక్తి 100 కోట్లకు పైగా ఆస్తులను సంపాదించుకుంటారని ఆ సంస్థ ప్రకటించింది . 2026 లో 207 మంది బిలియనీర్లు మనదేశంలో ఉన్నారు. ఆ సంఖ్యతో పోల్చి చూస్తే 2031 నాటికి 51 శాతం శ్రీమంతులు పెరిగే అవకాశం ఉంది. చైనాలో 20%.. అమెరికాలో 12% శ్రీమంతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆ సంస్థ వెల్లడించింది. ది వెల్త్ రిపోర్టులో ఆ సంస్థ ఈ నివేదికను వెల్లడించింది.ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న వ్యాపారాలు.. ఇతర వ్యవహారాల వల్ల ప్రతిరోజు ప్రపంచంలో 89 మంది అల్ట్రా రిచ్ (30 మిలియన్ డాలర్ల సంపద) గా మారుతున్నట్టు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 3,110 మంది బిలియనీర్లు ఉన్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్య 3,915 కి పెరుగుతుందని సమాచారం. "ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నప్పటికీ.. విభిన్నమైన వ్యాపారాలు చేసేవారు తమ సంపదను పెంచుకుంటున్నారు.




ప్రపంచ వ్యాప్తంగా ప్రజల అవసరాలు మారిపోతున్న క్రమంలో.. కొంతమం ప్రత్యేకమైన వ్యాపారాలు చేస్తున్నారు. అందువల్ల వారు తమ సంపాదనను పెంచుకుంటున్నారు. అందువల్లేవారు ఈ స్థాయిలో శ్రీమంతులుగా మారిపోతున్నారని" నైట్ ఫ్రాంక్ సంస్థ ది వెల్త్ రిపోర్టులో పేర్కొంది.

# బెంగాల్ లోనే బీజేపీ టీమ్...

**కోల్ కత్తా, ఏప్రిల్ 28:** బెంగాల్ లో ఈసారి ఎలాగైనా అధికారాన్ని చేపట్టి, మమతా బెనర్జీకి చుక్కలు చూపించాలని బీజేపీ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే మొదటి దశ లో బీజేపీ భారీగానే ప్రచారం చేసింది. ముఖ్యంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యవహారాన్నంతా తమ భుజాలపైనే వేసుకున్నారు. తృణమూల్ పై, సీఎం మమతాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విమర్శలకు దిగారు.మరోవైపు మొదటి దశలో దాదాపు 90 శాతం పోలింగ్ జరిగింది. దీంతో తామే అధికారంలోకి వస్తామని బీజేపీ ఘంటాపథంగా చెబుతోంది. అయితే.. రెండో దశ పోలింగ్ నేపథ్యంలో బీజేపీ మరింత అలర్ట్ అయ్యింది. ఇప్పటికే మొదటి దశ పోలింగ్ జరుగుతున్న సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా బెంగాల్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోనే వుండిపోయారు. అక్కడి నుంచే ఎప్పటికప్పుడు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తూ వచ్చారు. అలాగే రెండో దశ పోలింగ్ పై కూడా వారందరితో మాట్లాడినట్లు బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.మరోవైపు ప్రధాని మోదీ కూడా ప్రస్తుతం బెంగాల్ లోనే పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా హుగ్లీ నదిలో బోట్ రైడ్ కి వెళ్లారు. తన వెంట ఓ కెమెరాను కూడా తీసుకెళ్లారు. దీంతో అందరి దృష్టినీ ఆకర్షించారు. అక్కడి నది



అందాలను క్లిక్ అనిపించారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి వుందని బెంగాల్ సెంటిమెంట్ ను తట్టిలేపారు. అంతేకాకుండా బెంగాలీల జీవితాల్లో గంగానదికి ప్రత్యేక స్థానం వుందని, దాని జలాలు ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ సందర్భంగా నదిలో పడవలు నడిపే వారితో, మార్నింగ్ వాక్ కి వచ్చిన వారితో కాసేపు ముచ్చటించారు.మరో వైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బెంగాల్ లోనే తిష్ఠ వేశారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మట్నదటి దశ ఎన్నికల్లో 152 స్థానాలకు గాను బీజేపీ 110కి పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమన్నారు. రెండో దశలోనూ తామే ఎక్కువ సీట్లు నెగ్గుతామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజీపీనే అంటూ ప్రకటించారు.మమతా బెనర్జీ, టీఎంసీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. అందుకు మట్నదటి దశలో 92.88 శాతం ఓటింగ్ నమోదు కావడమే నిదర్శనమన్నారు. బెంగాల్ ఓటర్లు అభివృద్ధిని ఎంచుకున్నారని తొలి దశ ఎన్నికలతో స్పష్టమైందని చెప్పుకొచ్చారు. బెంగాల్‌లో మార్పు కోసం ప్రజలు ఉత్సాహంగా ఓట్లు వేశారన్నారు. మహిళల రక్షణ బీజేపీ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు.స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, స్థానిక పోలీసులు, భద్రతా దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఒక్కరి ప్రాణం కూడా పోకుండా జరిగిన బెంగాల్ ఎన్నికలు ఇవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

# అమెరికాలో ఏం జరుగుతోంది...

**కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్...**

**హైదరాబాద్, ఏప్రిల్ 28:** అమెరికాను సుసంపన్నం చేసిందే హెచ్1బీ వీసా.. ఎందుకంటే ఈ వీసా ఆధారంగా చేసుకుని ప్రపంచం నలుమూలల నుంచి ప్రతిభావంతులు అమెరికా గడ్డపై అడుగుపెట్టి.. అక్కడే తమ భవిష్యత్తును నిర్మించుకున్నారు. అంతేకాదు.. దాంతో పాటు అమెరికా ఆర్థికవ్యవస్థను సైతం సుసంపన్నం చేశారు. అందుకే వారిని అమెరికా సైతం అంతేస్థాయిలో గౌరవించింది కూడా. కానీ ఎప్పుడైతే ట్రంప్ అధికారంలోకి వచ్చారో.. అప్పటి నుంచి వారిని వేరు చేసి మాట్లాడడం మొదలు పెట్టారు. వారిని దొంగలుగా, దోపిడీ దారులుగా చిత్రీకరించడం పెరిగిపోయింది.సాక్షాత్తూ అధ్యక్షుడే .. ఎన్నారైలు ఇక్కడకు వచ్చి, తమ అవకాశాలను దోచేస్తున్నారని పదేపదే ప్రకటిస్తుండడంతో.. ఇక ప్రజలు ఊరుకుంటారా..? దీంతో ఇప్పుడు అమెరికాలో తమ కలల సౌధాన్ని నిర్మించుకున్న సగటు ఎన్నారై.. తాము దశాబ్దాల క్రితం చేసింది తప్పా అని అంతర్మథనంలో పడిపోయాడు. ఎందుకంటే అక్కడే ఆస్తులు కొన్నారు. అక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు.. అక్కడే పిల్లలు పుట్టి పెరిగి పెద్దవాళ్లై అమెరికా సిటిజన్లుగా మారిపోయారు. ఇప్పుడు వారందరికి మీరు ఇక్కడి వాళ్లు కాదు.. వెళ్లిపోండని



అల్టిమేటమిస్తే.. ఎలా ఉంటుంది. మనస్సు చివుక్కు మనదూ..దీంతో ఇప్పుడు అమెరికాలో స్థిరపడిన ఎన్నారైల్లో 40 శాతం మంది తిరిగి వెళ్లిపోతే బాగుంటుందా అన్న ఆలోచనలో పడ్డారు. ఇది సాదారణ విషయం కాదు.. ఎందుకంటే.. ఓ స్థాయికి వెళ్లిన వ్యక్తి... దేశంకోసం జీవితాంతం కష్టపడిన కుటుంబాలు తిరిగి వెళ్లిపోదామని భావించాయంటే.. అది వారిని ఎంతగా మానసికంగా , శారీరకంగా ఇబ్బంది పెట్టాయో అర్థమవుతుంది. వీరు వెళ్లిన తర్వాత మళ్లీ ప్రతిభావంతులను రమ్మని అమెరికా ఆహ్వానించగలదా.. ఆహ్వానించినా వీటన్నింటిని చూసిన యువత.. మళ్లీ అటువైపు చూస్తుందా.. అంటే అమెరికా.. ఇక అమెరికన్లకే పరిమితం కానుంది.దీనర్థం ఇక అమెరికా ప్రతిభావంతులకు ఆహ్వానం పలికే పరిస్థితి ఉండదు.. కేవలం వారు అమెరికన్లు అయితే చాలు అన్న సంకుచిత స్వభావాన్ని వంట పట్టించుకుంటోంది. దీంతో ఇక అక్కడ నూతన ఆవిష్కరణలు తగ్గిపోతాయి. కొత్త కంపెనీల రాక, పెట్టుబడులు నిలిచిపోతాయి. సాదారణ సగటు దేశంగా అమెరికా మారనుందన్న అంశం దీంతో అర్థమవుతోంది.ఓవైపు ఇరాన్ యుద్ధంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ .. తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ముఖ్యంగ్గ ఆయుధాలకే లక్షల డాలర్లు ఖర్చుపెడుతోంది. వీటన్నింటికీ ఎవరి దగ్గర వసూలు చేస్తుంది. మళ్లీ సగటు అమెరికన్ దగ్గరే. ఓవైపు ఖర్చులు పెరుగుతున్నాయి. మరోవైపు..ఆర్థికాన్ని పరుగు పెట్టించే ప్రతిభావంతులు దేశం దాటిపోనున్నారు. ఇక అమెరికాకు మంచి రోజులు అన్నవి గతమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఉపాధి హామీ పనులపై డీఆర్డీఓ అధికారిణి పర్యవేక్షణ

**పెండింగ్ వేతనాల చెల్లింపులపై హామీ పనులు వేగవంతం చేయాలని ఆదేశం**

**గీసుగొండ, ఏప్రిల్ 28 అక్షర సవాల్:** గీసుగొండ మండలంలో ఉపాధి హామీ పనులపై అధికారుల దృష్టి కేంద్రీకృతమైంది. ఈ నేపథ్యంలో డీఆర్డీఓ అధికారిణి కె. నాగ పద్మజ మంగళవారం ఊకల్, నందనాయక్ తండా, కొమ్మాల, కొనాయిమాకుల గ్రామాల్లో జరుగుతున్న పనులు, నర్సరీలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరిశీలన సందర్భంగా ప్రతి గ్రామ పంచాయితీలో కనీసం 100 మంది వేతనదారులతో పనులు ముమ్మరంగా కొనసాగించాలని ఆమె ఆదేశించారు. ఏప్రిల్, మే నెలల్లో లేబర్ బడ్జెట్ పూర్తి స్థాయిలో చేరేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఫిబ్రవరి 2026 నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఈ వారంలోనే చెల్లిస్తామని ఆమె హామీ ఇవ్వడం కార్మికులకు ఊరటనిచ్చింది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్మికులు ఉదయం వేళల్లో పనులకు హాజరై, కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి




రోజుకు రూ.307 వేతనం పొందాలని సూచించారు. ఎన్ఎంఎంఎస్ అటెండెన్స్‌లో రెండు ఫోటోలు తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి 40 మంది వేతనదారులకు ఒక వర్కింగ్ మేట్‌ను నియమించుకోవడం ద్వారా హాజరు నమోదు, పనుల నిర్వహణ సులభతరం అవుతుందని వివరించారు. పనులు జరుగుతున్న ప్రదేశాల్లో నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స సదుపాయాలు తప్పనిసరిగా




కల్పించాలని గ్రామ పంచాయితీలకు ఆదేశించారు. నర్సరీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పూలు, పండ్లు, ఔషధ మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలను రహదారుల ఇరువైపులా విస్తృతంగా నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# “ప్రభుత్వ బడుల వైపు అడుగులు”

**మడికొండలో బడిబాటతో విద్యా చైతన్యం... ఇంటింటికి చేరిన ఉపాధ్యాయ బృందం**



**మడికొండ, ఏప్రిల్ 28 అక్షర సవాల్:** గ్రామీణ విద్యాభివృద్ధికి కొత్త ఊపు తీసుకురావాలనే లక్ష్యంతో మడికొండ గ్రామంలో బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ గుర్రం రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందిస్తున్నారని వివరించారు. విశాలమైన ఆట స్థలం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనతో పిల్లల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడులే ఉత్తమ వేదిక అని నొక్కి చెబుతూ, ప్రతి తల్లిదండ్రి తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దివ్యాంగుల హక్కులకు కాంగ్రెస్ కట్టుబాటు

## 94 మందికి ఆధునిక సహాయక పరికరాల పంపిణీ

**హనుమకొండ, ఏప్రిల్ 28 అక్షర సవాల్:** దివ్యాంగులకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు చెందిన 94 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, మోటార్ సైకిళు ,, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు తదితర ఆధునిక సహాయక పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, చైర్మన్ ముత్తినేని వీరయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ--- “దివ్యాంగుల అభివృద్ధి లేకుండా సమాజ



ప్రగతి సాధ్యం కాదు. వారి సామర్థ్యాలను వెలికితీసి ప్రోత్సహిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది” అని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం



అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుని అన్ని రంగాల్లో ముందుకు రావాలని దివ్యాంగులకు పిలుపునిచ్చారు. సమాన అవకాశాలతో దివ్యాంగులు సమాజంలో ముందడుగు వేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# విద్యార్థులను కాపాడిన విశ్వేశ్వర్

**వ్యసనాల బారిన పడకుండా అడ్డుకట్ట... నగదు పురస్కారం**




**గీసుగొండ, ఏప్రిల్ 28 అక్షర సవాల్:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గీసుగొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తన విధుల్లో చూపిన కట్టుదిట్టమైన చర్యలకు గుర్తింపుగా ప్రశంసాపత్రంతో పాటు నగదు పురస్కారం అందుకున్నారు. గుట్కా, తంబాకు వంటి హానికర వ్యసనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, విద్యార్థులు, చిన్నపిల్లలు వాటి బారిన పడకుండా అడ్డుకునేందుకు ఆయన తీసుకున్న చర్యలు విశేష ఫలితాలను ఇచ్చాయి. ప్రజారోగ్యం, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అమలు చేసిన ఈ చర్యలు పోలీస్ శాఖలో ప్రశంసలు పొందుతున్నాయి. ఇటీవల నిర్వహించిన పోలీస్ కమిషనర్ క్రైమ్ రివ్యూలో ఈ గౌరవాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్ క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథం పోలీస్ శాఖకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వ్యసనాల నిర్మూలనలో ఆయన చూపిన చురుకుదనం ఇతరులకు మార్గదర్శకమని తెలిపారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం





**రైతు పంట బూడిద**

**నల్లబెల్లి, ఏప్రిల్ 28 అక్షర సవాల్:** లెంకలపల్లి గ్రామం పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కస్తూరిపల్లి సమీపంలో ఉన్న యడండ ముత్తయ్య మొక్కజొన్న చేనులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. కోత కోసి నిల్వ ఉంచిన దాదాపు 60 బస్తాల మొక్కజొన్న క్షణాల్లో అగ్నికి ఆహుతై పూర్తిగా కాలిపోయింది. మంటలు వేగంగా వ్యాపించడంతో భారీ నష్టం వాటిల్లింది. సమీప గ్రామమైన కస్తూరిపల్లి ప్రజలు అప్రమత్తంగా స్పందించి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. వారి చొరవతో మరింత నష్టం తప్పింది. చేతికొచ్చిన పంట కళ్లముందే బూడిద కావడంతో రైతు కొమురయ్య బోరున విలపించాడు. ఈ ఘటనతో తీవ్ర మనోవేదనకు గురైన ఆయనకు తక్షణ సహాయం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బాధిత రైతుకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని, అధికారులు వెంటనే సంఘటన స్థలాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేసి సహాయం అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

# డిప్యూటీ మేయర్ ను వెంటనే అరెస్టు చేయాలి..

**ఉద్యోగులపై దాడికి నిరసనగా నల్లబ్యాడ్జీలతో ఆందోళన**

**బల్దియా ఎదుట అధికారులు, సిబ్బంది నిరసన...**







**వరంగల్ ప్రతినిధి, అక్షర సవాల్:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం కరీంనగర్ కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చిన మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేష్, ఎంహెచ్ఓ సుమన్ అందుబాటులో లేకపోవడంతో శానిటరీ సూపర్‌వైజర్ శ్యామ్ రాజ్‌ను పిలిచి ఇద్దరు అధికారులపై దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేశారు. ఆఫీస్ ఫర్నిచర్‌ను కూడా ధ్వంసం చేసినట్లు ఉద్యోగులు తెలిపారు.

**ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ...**

కరీంనగర్ మాజీ కార్పొరేటర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, ఉద్యోగులపై దాడులను అరికట్టి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

**రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు:**

ఈ ఘటనను ఖండిస్తూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఉద్యోగులు నిరసనలు తెలపాలని సెంట్రల్ యూనియన్లు పిలుపునిచ్చాయి. దీనిలో భాగంగా జీడబ్ల్యూఎంసీలోనూ లంచ్ టైమ్‌లో అధికారులు, ఉద్యోగులు కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చంద్ర శేఖర్ , డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీను, ప్రసన్న రాణి,సీఎంఓహెచ్ డా. రాజారెడ్డి,ఎంహెచ్ఓ రాజేష్ , సూపరింటెండెంట్లు సంతోష్,హబీబ్, ఆనంద్, శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెచ్ అసిస్టెంట్లు,ఉద్యోగులు పాల్గొన్నారు.

అలాగే జేఏసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, బహుజన, మున్సిపల్ ఉద్యోగుల సంఘాలు కూడా తమ సంఘీభావాన్ని తెలియజేశాయి.

# ఓపెన్ హార్ట్ సర్జరీ బాధితునికి అండగా ‘ఉబుంటు టీం’

**ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటిన సేవా సంస్థ**



**గీసుగొండ, ఏప్రిల్ 28 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రానికి చెందిన షేక్ అంకూస్ పాషా (షరీఫ్) అనే నిరుపేద ఆటోడ్రైవర్‌కు సామాజిక సేవా సంస్థ “ఉబుంటు టీం” అండగా నిలిచి మానవత్వాన్ని చాటింది. గుండె సంబంధిత వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్న అంకూస్ పాషా ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. కుటుంబానికి స్థిరమైన ఆదాయం లేకపోవడంతో మందుల ఖర్చులు, జీవనోపాధి నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతని పరిస్థితిని తెలుసుకున్న “ఉబుంటు టీం” స్పందించి రూ. 8,000 ఆర్థిక సహాయం అందించింది. ఈ సహాయాన్ని గీసుగొండ గ్రామ సర్పంచ్ వీరగొని రాజు కుమార్, మనుగొండ గ్రామ సర్పంచ్ పేర్ల శ్రవణ్ చేతుల మీదుగా బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉబుంటు టీం ప్రతినిధులు కర్ణకంటి రాంమూర్తి, మంద నవీన్, స్థానిక నాయకులు దౌడు సునీల్, దౌడు రాజు, పొగాకు బిక్షపతి, రాగిరి రాజేందర్‌తో పాటు సోషల్ మీడియా కార్యకర్త బానోత్ రేవంత్ రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరగొని రాజు కుమార్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న గ్రామస్థుడికి సకాలంలో సహాయం అందించిన ఉబుంటు టీంకు కృతజ్ఞతలు తెలిపారు. విద్య, వైద్యం, పేదరికం వంటి సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సంస్థ సేవలు అభినందనీయమని కొనియాడారు.

# పెన్షన్లపై పాలాభిషేకం..

**సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ వినూత్న నిరసన**

**కెసిఆర్ ఇచ్చిన 2 వేలైన అయినా ఇవ్వండి...**

**వితంతువుల పెన్షన్లు వెంటనే విడుదల చేయాలి**

**కార్పొరేటర్ మనీషా శివ కుమార్ డిమాండ్..**

**గీసుగొండ, అక్షర సవాల్:** పెండింగ్‌లో ఉన్న వితంతువుల పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు వినూత్న రీతిలో నిరసనకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తూ తమ ఆందోళన తెలిపారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామపంచాయతీ వద్ద సోమవారం కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్ ఆధ్వర్యంలో వితంతువులతో కలిసి ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు.

**కాంగ్రెస్ మోసం చేసింది:**

ఎన్నికల మేనిఫెస్టోలో వితంతువులకు నెలకు రూ.4,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో సుమారు 1500 మంది వితంతువులకు పెన్షన్ మంజూరు అయినప్పటికీ, వాటికి అవసరమైన బడ్జెట్ కేటాయించడం లేదని విమర్శించారు.




**రెండున్నరేళ్లుగా ఎదురుచూపులు:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ పెన్షన్లు అందకపోవడంతో వితంతువులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్పొరేటర్ మనీషా శివకుమార్ తెలిపారు.

**కేసీఆర్ ఇచ్చిన పెన్షన్ అయినా ఇవ్వండి:**

ఇప్పటికైనా గతంలో కె. చంద్రశేఖర్ రావు ప్రభుత్వంలో అందించిన రూ.2,000 పెన్షన్ అయినా వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వితంతువుల కష్టాలు తీర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, వితంతువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు మధ్యాహ్నం 2 గంటలకు
# పదో తరగతి ఫలితాలు విడుదల..

**హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీ గోదావరి ఆడిటోరియంలో విడుదల చేయనున్న ప్రభుత్వ సలహాదారు**

**హైదరాబాద్, అక్షర సవాల్:** తెలంగాణ రాష్ట్రంలో 2026 మార్చిలో నిర్వహించిన ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలను రేపు అనగా 29.04.2026, బుధవారం మధ్యాహ్నం 2:00 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం తెలిపింది.

**ఎక్కడ విడుదల:**
బషీర్‌బాగ్, ఎల్‌బీ స్టేడియం ఎదురుగా ఉన్న ఎస్‌సీఈఆర్‌టీ క్యాంపస్‌లోని లిగోదావరి ఆడిటోరియం, గ్రౌండ్ ఫ్లోర్‌లిలో ఫలితాలను విడుదల చేయనున్నారు.

**హాజరయ్యే ప్రముఖులు:**
తెలంగాణ ప్రభుత్వ గౌరవ సలహాదారు శ్రీ కె. కేశవ రావు గారి చేతుల మీదుగా ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీమతి డాక్టర్ యోగితా రాణా, ఐఏఎస్ గారు, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్, ఐఏఎస్ గారు పాల్గొంటారు.

**ఫలితాలు ఎలా చూసుకోవాలి:**
విద్యార్థులు తమ ఫలితాలను ఈ క్రింది వెబ్‌సైట్లలో చూసుకోవచ్చు:
- https://results.bsetelangana.org
- https://results.bse.telangana.gov.in
- https://bse.telangana.gov.in
- https://schooledu.telangana.gov.in

**మీసేవ వాట్సాప్ ద్వారా:** 8096958096 నంబర్‌కు '»Hi' అని వాట్సాప్ చేసి, అవసరమైన వివరాలు నమోదు చేసి ఫలితాలు తెలుసుకోవచ్చు విద్య శాఖ సంచాలకులు తెలిపారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**ఎలుకుర్తిలో సాగు మార్గదర్శకాలు**
**పంటమార్పిడి, లాభసాటి రకాలపై రైతులకు అవగాహన**



**గీసుకొండ, ఏప్రిల్ 28 అక్షర సవాల్:** రైతుల ముంగిటికే శాస్త్రవేత్తలు చేరుకుని ఆధునిక సాగు పద్ధతులపై మార్గనిర్దేశం చేసిన విశేష కార్యక్రమం ఎలుకుర్తి గ్రామంలో నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" పేరుతో జరిగిన ఈ అవగాహన శిబిరం వానాకాలం సాగుకు రైతులను సిద్ధం చేసింది. గ్రామ సర్పంచ్ జే. దివ్యభారతి అధ్యక్షతన రైతువేదికలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) మల్యాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సంయుక్తంగా నిర్వహించాయి.

**నేల ఆరోగ్యంపై శాస్త్రవేత్తల సూచనలు**
కేవీకే కోఆర్డినేటర్ డా. బి. దిలీప్ కుమార్ మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగాన్ని అవసరానికి మాత్రమే పరిమితం చేసి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని రైతులకు సూచించారు. యూనివర్సిటీ అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలు వినియోగిస్తే పురుగుల ముప్పు తగ్గి, అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాల సాగుపై కూడా రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించారు.

**పంటమార్పిడితో ఖర్చుల తగ్గింపు**
శాస్త్రవేత్త డా. ఎం. మధు మాట్లాడుతూ, యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చుని, పంటమార్పిడి పాటిస్తే స్థిర ఆదాయం పొందవచ్చుని వివరించారు. సాగునీటి ఆదా, ప్రత్యామ్నాయ పంటలు, సేంద్రీయ సాగు విధానాలపై రైతులకు విపులంగా వివరించారు. నేల సారాన్ని పెంచేందుకు జిలుగు, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించారు. వరి సాగులో నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతులపై కూడా అవగాహన కల్పించారు.

**శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడులు**
మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ మాట్లాడుతూ, శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించాలని రైతులను కోరారు. కార్యక్రమంలో రైతుల సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. వ్యవసాయ విస్తరణ అధికారి స్మిత, అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు అనంతలక్ష్మి, కావ్యతో పాటు సుమారు 50 మంది రైతులు పాల్గొన్నారు. రైతు ఇంటి వద్దకే శాస్త్రసాంకేతిక జ్ఞానం చేరడం వల్ల సాగులో నూతన పద్ధతులపై రైతుల్లో అవగాహన పెరిగి, లాభసాటి వ్యవసాయానికి దారితీస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# సంక్షేమ పథకాల ప్రచారంలో సమాచార శాఖను ఆధునీకరించాలి

**ఐఅండ్‌పీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డిని కలిసిన టీఎస్జేయూ బృందం**





**హైదరాబాద్, అక్షర సవాల్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాలంటే సమాచార పౌర సంబంధాల శాఖ తన ప్రచార శైలిని మరింత ఆధునీకరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల యూనియన్ (టీఎస్జేయూ) రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం అన్నారు.మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఐఅండ్‌పీఆర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డిని టీఎస్జేయూ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది.

**ప్రచార విభాగాలను బలోపేతం చేయాలి:**
ఈ సందర్భంగా నారగౌని పురుషోత్తం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సమాచార శాఖది కీలక పాత్ర అని నొక్కి చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి, ప్రచార విభాగాలను బలోపేతం చేయడం ద్వారా పథకాల లబ్ధిని ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని ఆకాంక్షించారు. అనుభవజ్ఞులైన ముకుంద రెడ్డి నేతృత్వంలో శాఖ కొత్త పుంతలు తొక్కుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**జర్నలిస్టుల సమస్యలపై సానుకూలత:**
అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారంపై కూడా కమిషనర్ సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ముత్యం ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొని కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు.

# జిల్లా కాంగ్రెస్ తొలి పీఏసీ సమావేశం

**బలోపేతానికి బ్లూప్రింట్, సంక్షేమానికి మద్దతు**

**హనుమకొండ, ఏప్రిల్ 28 అక్షర సవాల్:** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తొలి రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఏసి) సమావేశం కీలక నిర్ణయాలకు వేదికైంది. పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి విస్తరణ, ప్రజా సంక్షేమం ప్రధాన అజెండాలుగా ఈ సమావేశం సాగింది. ముఖ్య అతిథులుగా నాయిని రాజేందర్ రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, వొడితెల ప్రణవ్, దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ నిర్మాణాన్ని గ్రామ స్థాయి నుంచి బలపర్చే దిశగా స్పష్టమైన రోడ్‌మ్యాప్ రూపొందించారు. జిల్లా, మండల కమిటీల నియామకాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రతి యూనిట్‌కు బాధ్యతలు వికేంద్రీకరించాలని తీర్మానించారు. ఎన్నికల్లో విజయం సాధించాలంటే బూత్ స్థాయిలో బలమైన నిర్మాణం అవసరమని భావించి, ప్రతి పోలింగ్ కేంద్రంలో దీూా-2 నియామకాలను పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించారు.




గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు కమిటీలను వేగంగా పూర్తి చేయాలని, పనితీరు ఆధారంగా మండల అధ్యక్షుల్లో మార్పులు, ప్రమోషన్లు చేపట్టాలని చర్చించారు. డీసీసీ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణం కోసం భూమి కేటాయింపు అంశాన్ని కూడా ప్రాధాన్యంగా పరిశీలించారు. రైతుల సంక్షేమంపై ప్రత్యేకంగా చర్చిస్తూ, యుఎస్డిఎల్ అంశం వల్ల ఎటువంటి అన్యాయం జరగకుండా కాంగ్రెస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే పార్టీ కార్యకర్తలు వెంటనే స్పందించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పాఠశాలల్లో 'బ్రేక్‌ఫాస్ట్ ఒ మిడ్-డే మీల్స్' పథకంపై సమావేశం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం, హాజరు పెంపు, ఏకాగ్రత అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతోందని అభిప్రాయపడింది. అదేవిధంగా, గిగ్ వర్కర్ల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావడాన్ని స్వాగతిస్తూ, జొమాటో, స్విగ్గి, ఓలా, ఉబర్ వంటి సంస్థల్లో పనిచేసే కార్మికులకు సామాజిక భద్రత కల్పించే దిశగా ఇది కీలక అడుగని పేర్కొన్నారు. మొత్తంగా, ఈ తొలి పీఏసీ సమావేశం పార్టీకి కొత్త దిశను నిర్దేశిస్తూ, భవిష్యత్ ఎన్నికలకు పటిష్ట వ్యూహరచనకు బాటలు వేసినట్లు నాయకులు అభిప్రాయపడ్డారు.

# "పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలి"

**సీఎంకు వినతి**

**నల్లబెల్లి, ఏప్రిల్ 28 అక్షర సవాలు:** గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేసి, కార్మిక చట్టాలను అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు నల్లబెల్లి మండల కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఎంపీడీవో కార్యాలయం ద్వారా ఈ మెమోరాండం అందజేశారు. 2024లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక కుటుంబ సర్వే ప్రకారం గ్రామాల జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బందిని అధికారిక కార్మికులుగా గుర్తించాలని వారు కోరారు. ప్రస్తుతం పని సమయంలో ప్రమాదాలు జరిగినా వైద్య ఖర్చులు సిబ్బందే భరించాల్సి వస్తోందని, మెడికల్ సెలవులు లేకపోవడం వల్ల జీతాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామపంచాయతీలలో ఆరు నెలలుగా జీతాలు



చెల్లించకపోవడం, 2011 జనాభా లెక్కల ఆధారంగా సిబ్బందిని నియమించడం వల్ల ప్రస్తుత అవసరాలకు సరిపడా సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలను వారు ప్రస్తావించారు. తక్కువ వేతనాలతో అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా కార్మికులకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. కేంద్ర జనాభా లెక్కలకంటే రాష్ట్రం నిర్వహించిన తాజా కులజనగణన ఆధారంగా సిబ్బందిని గుర్తించి, కార్మిక హక్కులు కల్పించాలని మెమోరాండంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య, మండల నాయకులు మామిండ్ల పెద్ద అయిలయ్య, జన్ను సుదర్శన్, మామిడిపెల్లి సంపత్, శనిగరం చిరంజీవి, మామిడిపెల్లి రవి, లోనే లింగయ్య, దండెం రాజ్‌కుమార్, కలకోటి రాజేష్, అశోక్ రాజ్‌కుమార్, మాట్ల సాంబయ్య, జాటోతు మోహన్ సింగ్, మాట్ల సునిత, చింత కరుణ, ముత్యాల రమా, బొద్దు సాయికుమార్, అంబిరాజు, ముందుకుమార్, బుసారి అప్పయ్య, భూక్యా సాంబయ్య, తియాలపురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిపై ఎమ్మెల్యే గట్టి ఫోకస్

**మౌలిక సదుపాయాలు--సంక్షేమం లక్ష్యంగా అధికారులకు కఠిన ఆదేశాలు**

**గీసుగొండ, ఏప్రిల్ 29 అక్షర సవాల్:** గ్రామాల అభివృద్ధిలో ఎలాంటి లోపం ఉండకూడదని, ప్రతి ఇంటికీ సంక్షేమం చేరాల్సిందేనని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. గీసుగొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, గ్రామ స్థాయి పాలనలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి ప్రాథమిక సదుపాయాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు సమస్యలు తలెత్తక ముందే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు కృషి



చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. వేసవిలో నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులలో మిషన్ భగీరథ నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని, నీటి వృథాను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. గ్రామాల్లో గుడుంబా తయారీ, గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలని స్పష్టంగా చెప్పారు. అలాంటి సంఘటనలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రేషన్ దుకాణాల్లో బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. "గ్రామాల్లో సమస్యలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యం" అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.

## ఆకస్మిక పర్యటనతో
# అలర్ట్ అయిన గీసుగొండ యంత్రాంగం

**డీఆర్‌డీఓ నాగపద్మజ సమీక్ష**
**ఉపాధి, లోన్ల వేగవంత అమలుకు స్పష్టమైన దిశానిర్దేశం**

**గీసుగొండ, ఏప్రిల్ 28 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డిఆర్డిఓ) కే. నాగపద్మజ గారు గీసుగొండ మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించి స్థానిక యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రగతి మండల సమైక్య గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కార్యాలయాన్ని సందర్శించిన ఆమె, ఉపాధి పనుల అమలు, ప్రగతి నివేదికలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రజా పాలన--ప్రగతి కార్యక్రమంలో భాగంగా హయ్యర్ లోన్లు, వ్యవసాయ రంగ లబ్ధిదారులను వేగంగా గుర్తించి గ్రౌండింగ్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లక్ష్యాలను టీం స్పిరిట్‌తో సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకున్న నాగపద్మజ, మహిళలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో సకాలంలో చేరేలా




వివోఏలు, సీసీలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈజీఎస్ పనుల ద్వారా పేదలకు నిరంతర ఉపాధి లభించేలా గ్రామ సంఘాల ద్వారా అవగాహన పెంచాలని సూచించారు.




ఈ సందర్భంగా సమైక్య కార్యాలయంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ కింద ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ యంత్రాలను పరిశీలించి, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇవి దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో ఏపీఎం ముక్కెర ఈశ్వరయ్య, సీసీలు బొజ్జ సురేశ్, శ్రీలత, నర్సయ్య, అకౌంటెంట్ జయంతిక, ఆపరేటర్ నాగరాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# కిషోర్ నాయక్ డుంగ్రోత్‌కు బంజారా నాయకుల జన్మదిన శుభాకాంక్షలు

**హన్మకొండ, అక్షర సవాల్:** డాడీ లంబాడి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర సెక్రటరీ డుంగ్రోత్ కిషోర్ నాయక్ జన్మదినం సందర్భంగా బంజారా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

**సమాజ సేవలో అంకితభావం:**
సమాజ సేవలో కిషోర్ నాయక్ చూపుతున్న అంకితభావం అందరికీ గర్వకారణమని బంజారా నాయకులు కొనియాడారు. బంజారా సమాజానికి ఆయన ఒక ముద్దు బిడ్డ, మార్గదర్శి అని అభివర్ణించారు.

**మరింత అభివృద్ధి సాధించాలి:**
కిషోర్ నాయక్ నాయకత్వంలో బంజారా సమాజం మరింత అభివృద్ధి, విజయాలు



సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక రోజున ఆయన జీవితంలో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం ఎల్లప్పుడూ నిండాలని, ఆయన ప్రతి అడుగు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# పుకార్లతో పానిక్ బయ్యింగ్..
# అప్రమత్తమైన తెలంగాణ సర్కార్!

**హైదరాబాద్, ఏప్రిల్ 28:**తెలుగు రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా పెట్రోల్, డీజిల్ కోసం కనిపిస్తున్న క్యూలైన్లు, "నో స్టాక్" బోర్డులు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన ఈ ఇంధన సెగ, ఇప్పుడు తెలంగాణ సరిహద్దు జిల్లాల మీదుగా రాష్ట్రవ్యాప్త చర్చకు దారితీసింది. అసలు ఈ పరిస్థితికి కారణం ఇంధన కొరత కాదు, కేవలం "పానిక్ బయ్యింగ్" (భయంతో కొనుగోలు చేయడం), ధరల వ్యత్యాసమేనని విశ్లేషణలు చెబుతున్నాయి.పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం ఇంధన ధరలు భారీగా పెరుగుతాయనే ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకుంది. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో కొన్ని బంకులు మూతపడటంతో, తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెం, వికారాబాద్, జోగులాంబ గద్వాల్ వంటి జిల్లాల ప్రజలు ఒక్కసారిగా బంకులకు పోటెత్తారు. "రేపు ధర పెరుగుతుంది.. ఇప్పుడే ఫుల్ ట్యాంక్ చేయించుకుందాం" అనే ఆందోళనతో అవసరం లేకున్నా వాహనదారులు ఎగబడటంతో రిటైల్ అవుట్‌లెట్ల వద్ద కృత్రిమ కొరత ఏర్పడింది.

మరో ముఖ్య కారణం ఇంధన ధరల మధ్య ఉన్న భారీ వ్యత్యాసం.

**రిటైల్ బంకుల్లో ధర: సుమారు రూ. 95 (లీటరుకు)**

**పారిశ్రామిక ధర: సుమారు రూ. 150 (లీటరుకు)**

ఈ రూ. 55 వ్యత్యాసం కారణంగా భారీ పరిశ్రమలు, రవాణా సంస్థలు తమ వాహనాలను రిటైల్ బంకుల వైపు మళ్లిస్తున్నాయి. దీనివల్ల సాధారణ వినియోగదారుల కోసం కేటాయించిన ఇంధనం త్వరగా నిండుకుంటోంది. దీనిని అరికట్టేందుకు ×డజ డీజిల్‌పై ఉన్న 27% వ్యాట్ (వాు)ను తాత్కాలికంగా తగ్గించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది.పరిస్థితిని గమనించిన తెలంగాణ పౌర సరఫరాల శాఖ (౧+ జజూ) అధికారులు రంగంలోకి దిగారు. ఇటీవల నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అన్ని రిటైల్ అవుట్‌లెట్లలో స్టాక్ కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా వరి సేకరణ, వ్యవసాయ పనులకు ఇంధన అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సరిహద్దు జిల్లాల డీసీఎస్‌ఓలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలకు ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కేవలం పుకార్లను నమ్మి పానిక్ బయ్యింగ్‌కు పాల్పడకుండా ఉంటే, పరిస్థితి త్వరలోనే సాధారణ స్థితికి చేరుకుంటుంది.

# అన్నీ రద్దు చేసి పడేసిన బాస్

- మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కమిటీ మినహా.. జిల్లా.. ఇతర కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే వారికి మాత్రమే టికెట్లు ఇస్తామని కేసీఆర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖం చూసి టికెట్ ఇవ్వడం కుదరదని కేసీఆర్ స్పష్టం చేశారు. కొంతమంది నాయకులలో ఇంకా అహంకారం తగ్గలేదని.. వారు తమ ధోరణి మార్చుకోకపోతే కష్టమని కేసీఆర్ అన్నారు. "అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తామని అనుకున్నాం. పార్లమెంటు ఎన్నికల్లో కూడా అద్భుతమైన విజయాన్ని అందుకుంటామని భావించాం. కానీ ఫలితం వేరే విధంగా వచ్చింది. కొంతమంది నాయకులు ఇంకా అహంకారంతో ఉన్నారు.. వారు తమ ధోరణి మార్చుకోవాలని" కెసిఆర్ సూచించారు.రాష్ట్ర కమిటీ మాత్రమే మనుగడలో ఉంటుందని ప్రకటించిన కేసీఆర్.. జిల్లాస్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. త్వరలోనే అన్ని స్థాయిలలో కొత్త కమిటీలను ప్రకటిస్తామని కెసిఆర్ అన్నారు. వారికి శిక్షణ ఇచ్చే బాధ్యతను కేటీఆర్ కు అప్పగించారు. భారత రాష్ట్ర సమితి సభ్యత్వ నమోదును కూడా ప్రారంభించాలని కేసీఆర్ అన్నారు. సభ్యత్వ రుసుము పది రూపాయలుగా ప్రకటించారు. ఆన్లైన్లో.. ఆఫ్లైన్లో సభ్యత్వ నమోదు చేపట్టాలని కెసిఆర్ ఆదేశించారు.ఇటీవల కవిత టిఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన నేపథ్యంలో.. కెసిఆర్ ఆమె గురించి మాట్లాడలేదు. పార్టీ ఆవిర్భావ సభలో కవిత కెసిఆర్ ను ఉద్దేశించి మారిన మనిషి.. మర మనిషి అని వ్యాఖ్యానించారు. అంతేకాదు కేసీఆర్ చుట్టూ పందికొక్కులు ఉన్నాయని ఆరోపించారు. అయితే కవిత పార్టీ ఆవిర్భావ సభ తర్వాత.. భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా హ్యాండిల్ లో డూప్లికేట్ ఒరిజినల్ అంటూ ఒక పోస్ట్ చేసింది. ఆ తర్వాత పార్టీ కార్యకర్తలను కవిత పార్టీ ఏర్పాటు మీద ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదని భారత రాష్ట్ర సమితి అధినాయకత్వం సూచించింది. ఈ నేపథ్యంలో ఉన్న కేసీఆర్ కూడా కవిత పార్టీ పట్ల ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదని తెలుస్తోంది.కనిపించని కార్యచరణబీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాటల్లో ఉండే పదును చేతల్లో ఉండదు. గత రెండు సంవత్సరాల నుంచి ఇదే తంతు నడుస్తుంది. ఎప్పుడో ఒకసారి సమావేశాలకు రావడం హడావిడి చేయడం తర్వాత కలుగులో దూరడం అలవాటుగా మారింది. తెలంగాణ ఎన్నికలు ఇంకా మూడేళ్లు మాత్రమే సమయం ఉంది. అయితే ఒక ఏడాది ముందు వచ్చి హడావిడి చేసినంత మాత్రాన సరిపోదు. నిత్యం జనంలో ఉండేందుకు ప్రయత్నించాలి. ఆయన ఆరోగ్యం సహకరించకపోవచ్చు. కానీ బాగున్న సమయంలోనైనా జిల్లాల పర్యటనలు చేస్తే ఆ జిల్లాల క్యాడర్ లో కొంత ఊపు వస్తుంది.కొన్నాళ్ల క్రితం పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై మూడు భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేస్తానని కేసీఆర్ ఆర్భాటంగా ప్రకటించారు. ఇది ప్రకటించి నెలలు గడిచింది. తర్వాత ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో ఆ యా జిల్లాల నేతలతో సమావేశమై సభల ఏర్పాటు పై చర్చించారు. మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో జరిగే సభలకు తానే స్వయంగా హాజరవుతానని ప్రకటించారు. అసలు దానిని అటకెక్కించారు. అంతకు ముందు వరంగల్ లో జరిగిన ఆవిర్భావ సభలో ఇక జనంలో ఉంటానని ప్రజా సమస్యలపై పోరాడతానని, ప్రభుత్వం మెడలు వంచుతానని కేసీఆర్ ప్రకటించారు. కానీ ఏడాది పూర్తయినా అతీ లేదు. గతీ లేదుఈ విషయాన్ని ఎవరో చెప్పలేదు. కేసీఆర్ మరమనిషి అని.. మారిన మనిషి అని, సారు జనం సమస్యలను గురించి పట్టించుకోవడం మానేశారని సాక్షాత్తూ ఆయన కుమార్తె టీఆర్ఎస్ ఆవిర్భావ సభలోనే వ్యాఖ్యానించారు. అందులో నిజం ఉండబట్టే కవిత ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారు. కేసీఆర్ ప్రజల్లోకి వస్తే ఆ క్రేజ్ వేరు. క్యాడర్ లో ఆ కిక్కు వేరు. కానీ సారు రారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజున ప్రగతి భవన్ నుంచి కారులో ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు వెళ్లిన కేసీఆర్ ఇప్పటి వరకూ ప్రజా సమస్యలపై స్పందించలేదు. అందుకే అధికార పార్టీ కూడా బీఆర్ఎస్ ను లైట్ గా తీసుకుంటుంది. కేసీఆర్ నేడు ఇంతే.. రేపు అంతే.. ఎప్పుడైనా అంతేనన్న కామెంట్స్ సొంత పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. మరి కేసీఆర్ ఇప్పటికైనా జనంలోకి వస్తారా? రారా? అన్నది చూడాలి.

# మండల స్థాయికి ప్రజావాణి

**హైదరాబాద్, ఏప్రిల్ 28:**రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని, తద్వారా వేగంగా సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన మరుసటి రోజున ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది.అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, అప్లికేషన్లు స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి ద్వారా ఫిర్యాదుల స్వీకరణను నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సీఎస్ కె. రామకృష్ణారావుతో పాటు సీఎంవో అధికారులను ఆదేశించారు.వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించాలని చెప్పారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని యోచిస్తున్నట్లు



సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించడంతో పాటు పరిష్కార పురోగతిని ఆ వ్యక్తులకు తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, తద్వారా అప్లికేషన్ పరిష్కారంలో ఆలస్యం జరగకూడదని చెప్పారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని, అప్పుడే ప్రభుత్వం నమ్మకం మరింత పెరుగుతుందన్నారు.ప్రజావాణి ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలన్నారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సీఎస్, ఉన్నతాధికారుల్ని ఆయన ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని అధికారులకు ఆయన సూచించారు.ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిరంతరం సమీక్షలు నిర్వహించాలన్నారు. పెండింగ్ ఫిర్యాదులపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులుగా చేయాలని సూచించారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కిందిస్థాయిలోనే తక్కువ సమయంలోనే పలు సమస్యలు పరిష్కరించే వీలుంటుందని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# రోహిత్ రెడ్డికి హైకోర్టు బెయిల్

**హైదరాబాద్, ఏప్రిల్ 28:**మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ హైకోర్టులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ నిబంధనలలో భాగంగా ప్రతిరోజూ దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని, తన పాస్‌పోర్టును పోలీసులకు అప్పగించాలని కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే డ్రగ్స్ కేసు దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేయవద్దని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డిని ఆదేశించింది.మార్చి 14న మొయినాబాద్ ఫాంహౌస్‌లో డ్రగ్స్ తీసుకోవడంతో పాటు, తనిఖీలకు వచ్చిన ఎస్‌వోటీ పోలీసులపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై రోహిత్ రెడ్డితో సహా మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. గతంలో ఉప్పర్‌పల్లి కోర్టులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురవ్వడంతో రోహిత్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఏప్రిల్ 8న ఈ పిటిషన్‌పై వాదనలు పూర్తికాగా, మంగళవారం (ఏప్రిల్ 28న) నాడు రోహిత్ రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఊరటనిచ్చింది. హైకోర్టు తీర్పుతో రోహిత్ రెడ్డి నెలన్నర రోజుల తరువాత చంచల్ గూడ జైలు నుంచి విడుదల కానున్నారు.మార్చి 14వ తేదీ అర్ధరాత్రి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఫాంహౌస్‌పై సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ూు) పోలీసులు ఆకస్మిక దాడి చేయడంతో డ్రగ్స్ వాడకం వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో ఫాంహౌస్‌లో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ మరికొందరు సన్నిహితులు పార్టీ చేసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు. అక్కడ భారీగా కొకైన్, ఎల్ఎస్‌డీ వంటి నిషేధిత మాదక ద్రవ్యాలు లభించడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఫాం హౌస్ లో తనిఖీలు చేస్తున్న సమయంలో నిందితులు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించడమే కాకుండా, ఎస్‌వోటీ అధికారులపై కాల్పులు జరిపేందుకు యత్నించారని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది.కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు రోహిత్ రెడ్డితో పాటు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల రక్త నమూనాల్లో డ్రగ్స్ ఆనవాళ్లు ఉన్నట్లు ఫోరెన్సిక్ నివేదికలు ధృవీకరించడంతో కేసు మరింత బలపడింది. రోహిత్ రెడ్డి, పుట్టా మహేష్ యాదవ్ సహా 6 మందికి పాజిటివ్



అంతకుముందే 'ఎమ్మెల్యేల కొనుగోలు కేసు'లో ఫిర్యాదుదారుడిగా ఉండి వార్తల్లో నిలిచిన రోహిత్ రెడ్డి, ఈ డ్రగ్స్ కేసులో నిందితుడిగా మారడం రాజకీయంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. పోలీసులు ఆయనను కస్టడీలోకి తీసుకుని డ్రగ్స్ ఎక్కడి నుండి సరఫరా అయ్యాయనే కోణంలో విచారించారు. దిగువ కోర్టు బెయిల్ నిరాకరించినప్పటికీ, చివరకు హైకోర్టు ప్రధాన నిందితుడిగా ఉన్న రోహిత్ రెడ్డి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

## ధాన్యం కొనుగోళ్లను
# వేగవంతంగా చేపట్టాలి

- మొదటి పేజీ తరువాయి

కల్పించాలని విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఏమైనా మరమ్మత్తులు అవసరం ఉంటే నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ట భాగంగా చేపట్టాలని ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెరిగేలా చూడాలన్నారు. విద్య వైద్యము మహిళ సంక్షేమం విద్యుత్తు వ్యవసాయము తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుకున్నామని కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించేలా చూస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటికి సంబంధించిన పనులు పెండింగ్లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతానికి అధికారులు అంతా ప్రత్యేకంగా కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులంతా సమన్వయంతో కలిసి పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కరీంనగర్ జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, డీఆర్డీవో శ్రీధర్,డీఎస్ఓ నర్సింగరావు సివిల్ సప్లై డిఎం రజనీకాంత్ డిపిఓ జగదీశ్వర్, హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి పలువురు జిల్లా అధికారులు మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖజానా నింపేదెలా..

- మొదటి పేజీ తరువాయి

ఆయన హెచ్చరించారు. ఖజానా గండం గట్టెక్కాలంటే సంప్రదాయేతర మార్గాల్లో కూడా ఆదాయాన్ని రాబట్టాలని సూచించారు.ఈ జాప్యాన్ని ఇక ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 100 రోజుల్లో తక్షణమే అమలు చేయగలిగే, ఫలితాలను ఇచ్చే ఆదాయ పెంపు మార్గాలపై స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మే 4వ తేదీ నాటికి పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు. అదే రోజు మళ్లీ కేబినెట్ సమావేశం నిర్వహించి, కమిటీ ఇచ్చే నివేదికపై చర్చించి తదుపరి కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు.తెలంగాణను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న పట్టుదలతో ఉన్న ముఖ్యమంత్రి, అధికారుల అలసత్వాన్ని ఏమాత్రం ప్రోత్సహించడం లేదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆదాయం పెంచే విషయంలో 'వంద రోజుల లక్ష్యం' ఇప్పుడు అధికారుల ముందున్న పెద్ద సవాలు. మే 4న జరగబోయే కేబినెట్ భేటీలో ఎలాంటి విప్లవాత్మక నిర్ణయాలు వెలువడతాయో, రాష్ట్ర ఆర్థికగమనం ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. కేవలం మాటలు కాకుండా, అంకెల్లో ప్రగతిని చూడాలని కోరుకుంటున్న రేవంత్ రెడ్డి సర్కార్, రెవెన్యూ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించే పనిలో నిమగ్నమైంది.

# శబరిమల కేసులో కీలక మలుపు..

- మొదటి పేజీ తరువాయి



అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదని కోర్టు తెలిపింది. నిర్దిష్టమైన ఆలయ సంప్రదాయాల కంటే, మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల పరిధినే తాము సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. వాదనల సమయంలో ఒక మహిళా న్యాయవాది అస్సాంలోని కామాఖ్య ఆలయ ఉదాహరణను కోర్టు ముందు ఉంచారు. అక్కడ మహిళల రుతుస్రావాన్ని ఒక వేడుకగా జరుపుకొంటారని ఆమె వివరించారు. అదే సమయంలో, అక్కడ జరిగే జంతు బలులను ఆపాలని ఒక పిటిషనర్ కోరగా.. ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ ప్రస్తావనను తోసిపుచ్చింది. సీనియర్ అడ్వకేట్ శ్రీధర్ పోతరాజు ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. 'మతపరమైన విశ్వాసాలను పరీక్షించేటప్పుడు నాస్తికుల అభిప్రాయాలను కోర్టు పరిగణనలోకి తీసుకోకూడదు' అని ఆయన వాదించారు. మతపరమైన హక్కులు కేవలం భక్తుల కోణం నుంచే చూడాలని, ఆచారాల పట్ల నమ్మకం లేని వారి వాదనలకు ఇక్కడ తావు లేదని ఆయన కోర్టుకు విన్నవించారు. ఆధ్యాత్మిక స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్-21 (జీవించే హక్కు)లో అంతర్భాగమని శ్రీధర్ పోతరాజు వాదించారు. మతపరమైన ఆచారాల్లో న్యాయస్థానాల జోక్యానికి ఖచ్చితమైన పరిమితులు ఉండాలని న్యాయవాదులు కోరారు. వ్యక్తిగత విశ్వాసాలకు, రాజ్యాంగ నైతికతకు మధ్య ఉన్న సమతుల్యతపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.

# లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ పర్యాటక శాఖలో కొలువులు

- మొదటి పేజీ తరువాయి

వారికి.. నెల రోజులపాటు తెలంగాణ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా శిక్షణ అందించాయి. ఈ శిక్షణ పూర్తి కావడంతో.. వారిని పర్యాటక శాఖలో కొలువుల్లోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. అందుకోసం'ఆపరేషన్ కగార్'ను తెరపైకి తీసుకు వచ్చింది. లొంగిపోయిన మావోయిస్టులకు నగదుతోపాటు పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం.. లొంగిపోయిన వారికి గిరి దర్శక్ గైడ్లుగా పర్యాటక శాఖలో ఉద్యోగాలు కల్పించింది.

# ఓయూ క్యాంపస్‌లో తీవ్ర విషాదం

**హైదరాబాద్, ఏప్రిల్ 28:**విద్యాకుసుమాలు వికసించాల్సిన ఓయూ క్యాంపస్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రేమించిన యువతి దూరం పెట్టిందన్న మనస్థాపంతో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాంధీ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి చికిత్స పొందుతూ చివరకు ప్రాణాలు విడిచాడు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల యువకుడు ఉస్మానియా యూనివర్సిటీలో మైనింగ్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ సమీపంలో ఒక్కసారిగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు, సిబ్బంది వెంటనే మంటలను ఆర్పి గాంధీ ఆసుపత్రికి తరలించారు. సుమారు 70 శాతం పైగా కాలిన గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడు, వైద్యులు శ్రమించినప్పటికీ మృతి చెందాడు.

**సూసైడ్ నోట్‌లో సంచలన విషయాలు**

ఘటనా స్థలంలో పోలీసులకు లభించిన సూసైడ్ నోట్ ఈ ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడించింది. తాను సాహితి అనే యువతిని గాఢంగా ప్రేమించానని, అయితే ఆమె తనను మోసం చేసిందని బాధితుడు లేఖలో ఆవేదన వ్యక్తం చేశాడు. తన ప్రియురాలికి ఒక అబ్బాయిని పరిచయం చేయగా, ఆ అబ్బాయి తన గురించి చెడుగా చెప్పడంతో ఆమె బ్రేకప్ చెప్పిందని అందులో రాశాడు. గతంలోనే ఒకసారి ఆత్మహత్యాయత్నం చేసిన ఈ యువకుడు, తిరిగి హైదరాబాద్ వచ్చిన తర్వాత ఆ యువతి వేరే వ్యక్తితో ప్రేమలో ఉన్నట్లు తెలుసుకున్నాడు. ఇదే విషయంపై ఆమెను నిలదీయగా.. "నిన్ను టైంపాస్ కోసం ప్రేమించాను" అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో తీవ్ర డిప్రెషన్‌కు లోనైనట్లు లేఖలో వివరించాడు.ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడవుతాడని ఆశించిన కొడుకు, ప్రేమ పేరుతో ఇలా తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒక చిన్న మాటకో లేదా ప్రేమ విఫలమైందన్న కారణంతోనో ఇలాంటి క్షణికావేశ నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసులు మరియు కౌన్సిలింగ్ నిపుణులు విద్యార్థులకు సూచిస్తున్నారు. ఈ ఘటనపై ఓయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిప్పుల కొలిమిలా తెలంగాణ.. వడదెబ్బ, పిడుగుపాటుతో నలుగురి మృతి

**రాష్ట్రంలో 46 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు**

**రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం**

**పలు జిల్లాల్లో సాయంత్రం కురిసిన చిరుజల్లులతో ఉపశమనం**

**ఉత్తర తెలంగాణ జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక**

తెలంగాణలో భానుడు భగభగ మండుతున్నాడు. ఈ వేసవిలో తొలిసారిగా ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల మార్కును తాకడంతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. సోమవారం ఒక్కరోజే తీవ్రమైన ఎండల ధాటికి తట్టుకోలేక వడదెబ్బతో ముగ్గురు, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు.సోమవారం రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో 45.9 డిగ్రీలు, పలు ఇతర జిల్లాల్లో కూడా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. హైదరాబాద్‌లో సైతం కొన్ని ప్రాంతాల్లో 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.ఈ తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా వివిధ జిల్లాల్లో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. మంచిర్యాల జిల్లాలో భోగారపు మారయ్య (56), పెద్దపల్లి జిల్లాలో దశరథం సౌమ్య (19),నారాయణపేట జిల్లాలో గుర్తు తెలియని వృద్ధుడు వడదెబ్బకు గురై మరణించారు. మరోవైపు, సంగారెడ్డి జిల్లాలో కుర్మరంగు జంగయ్య (51) అనే రైతు పొలంలో పనిచేస్తుండగా పిడుగుపడి మృతిచెందాడు.మధ్యాహ్నం వరకు ఉగ్రరూపం చూపిన సూరీడు సాయంత్రానికి చల్లబడ్డాడు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ సహా పలు జిల్లాల్లో చిరుజల్లులు కురవడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అయితే, రానున్న మూడు రోజులు వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని, ఉష్ణోగ్రతలు మరో 1-2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో వడగాల్పులు, మరికొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## ఒకటి, రెండు రోజుల్లో టెన్త్ రిజల్ట్స్




**హైదరాబాద్, ఏప్రిల్ 28:**తెలంగాణలోని లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం దాదాపు ఖరారైంది. ఈ నెల 29 లేదా 30వ తేదీల్లో ఫలితాలను వెల్లడించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 14న ప్రారంభమైన పదో తరగతి ప్రధాన పరీక్షలు.. ఈ నెల 13వ తేదీతో విజయవంతంగా ముగిశాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు.పరీక్షలు ముగిసిన వెంటనే విద్యాశాఖ యుద్ధప్రాతిపదికన మూల్యాంకన ప్రక్రియను చేపట్టింది. ఈ నెల 23వ తేదీ నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడంతో.. ఫలితాలను అనుకున్న సమయం కంటే ముందే విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. వాస్తవానికి మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేయాలని భావించినప్పటికీ, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు, పై చదువుల ప్రవేశాలకు వీలుగా ఈ నెల 29నే ఫలితాలను విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా సానుకూల స్పందన లభించినట్లు సమాచారం.ఒకవేళ సాంకేతిక కారణాల వల్ల వీలుకాని పక్షంలో.. మరుసటి రోజైన 30వ తేదీన ఫలితాలను కచ్చితంగా వెల్లడిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అధికారికంగా విడుదల చేయనున్నారు. ఇప్పటికే మార్కుల నమోదు, సాంకేతిక తనిఖీలు పూర్తి కావచ్చాయని, విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని విద్యాశాఖ తెలిపింది. ఫలితాల విడుదల తేదీపై స్పష్టత రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరీక్షణకు తెరపడనుంది.ఇక తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యాశాఖ కీలక అప్డేట్ అందించింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆశించిన మార్కులు రాని వారు, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలను మే 10వ తేదీలోపు ప్రకటించనున్నట్లు ఇంటర్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. విద్యార్థుల్లో ఉన్న సందిగ్ధతను తొలగించేందుకు మే 5 నుంచి 10వ తేదీల మధ్య ఫలితాలను వెల్లడించాలని బోర్డు నిర్ణయించింది.ఇక ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను బోర్డు ఇప్పటికే ఖరారు చేసింది. ఏప్రిల్ 12న వెలువడిన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని వారు, అలాగే మార్కులు పెంచుకోవాలనుకునే ఫస్టియర్ విద్యార్థుల కోసం మే 13 నుంచి మే 21 వరకు థియరీ పరీక్షలు నిర్వహించనున్నారు. థియరీ పరీక్షలు మే 13 -- మే 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలు మే 22 -- మే 25 వరకు నిర్వహించనున్నారు. రీవెరిఫికేషన్ ఫలితాల వెల్లడి అనంతరం విద్యార్థులు తమ సప్లిమెంటరీ పరీక్షల ప్రిపరేషన్‌పై ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవచ్చని.. ఎలాంటి ఆందోళన చెందకుండా విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని బోర్డు అధికారులు సూచించారు.

## చంపాపేట లో ఎంపి ఈటల పర్యటన



**హైదరాబాద్:**చంపాపేట్ డివిజన్ లో కాలనీ సమస్యలను పరిశీలించి, పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ సాయి నగర్ మద్దెల చెరువు ఒక మురికి కూపం లాగా ఉండేది. ఈ ప్రాంతంలో ఉన్న డ్రైనేజ్ అంత ఇక్కడే నిల్వ ఉండి, ఈగలు, కంపు వాసన, చుట్టుపక్కల ఎక్కడ బోరు వేసినా పొల్యూటెడ్ వాటర్ తో సతమతమవుతున్నారాని దివంగత నేత వంగ మధు గారు మంచినీళ్ల చెరువుగా చేయాలని ప్రయత్నం చేసి కోటి రూపాయలతో డ్రైనేజీ పైప్ లైన్ వేయించారు. కానీ శుభ్రపరిచే వాళ్ళు లేక పైపు కెపాసిటీ సరిపోక ఎక్స్ట్రా ఆయన నీరంతా కూడా చెరువులోకి పోయి మళ్ళీ మురికి కూపం లాగా మిగిలిపోయింది. దీని ప్రక్షాళన కోసం మురికి నీరు చెరువులోకి రాకుండా ఉండటం కోసం, అవసరమైతే ఇంకో పైప్లైన్ వేసి దాని కెపాసిటీ పెంచుతామని అన్నారు.చెరువు దగ్గర జులాయిల, పోకిరిల అడ్డాగా మారిపోయింది. ఇది మాదకద్రవ్యాలకు అడ్డాగా కాకుండా ఉండాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తాము. చెరువు చుట్టూ ఫెంక్షన్ కూడా వేయించాలని కోరారు. దానిపై నేను అధికారులతో మాట్లాడి వేయించే ఏర్పాటు చేస్తానని హామీ ఇస్తున్నాను. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే రాజకీయాల, ఫోటోల, ఆధిపత్యం కోసం పాకులాడే వాళ్ళని చూస్తున్నాం. ప్రజలకు ఎవరు ఏం చేస్తారో గమనిస్తూనే ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలు నా దగ్గరకు వచ్చి కంప్లైంట్ చేస్తే నేను పరిశీలిస్తానని చెప్పాను ఇప్పుడు వచ్చి పరిశీలిస్తున్నాను. దీనికి ఏమేమి పనులు పెండింగ్ ఉన్నాయో అవన్నీ చేసే ప్రయత్నం చేస్తానని అన్నారు.హైదరాబాదులో ఎక్కడ చూసినా ఏదో ఒక మూలన పైప్ లైన్ కోసం తవ్వుతూనే ఉంటారు. వేగంగా పెరుగుతున్న సిటీకి అనుగుణంగా పైప్లైన్ కెపాసిటీ ఉండాలి. మెగా ఫంక్షన్ హాల్ దగ్గర దివంగత నేత వంగ మధు గారి ప్రోత్బలం, నేను లెటర్ పెట్టి 6 కోట్ల రూపాయలతో కొత్త బాక్స్ డ్రైనేజీ కట్టడం జరుగుతుంది. దాన్ని కూడా అధికారులతో మాట్లాడి సకాలంలో పూర్తయ్యే ప్రయత్నం చేస్తాను. కార్పొరేటర్ల కాల పరిమితి అయిపోతున్నప్పుడే చెప్పినం... ఎంతోమంది కార్పొరేటర్లు నిత్యం ప్రజల మధ్యలో ఉంటేనే సమస్యలు పరిష్కారం అవడం కష్టం ఉంది వారంతా దిగిపోయారు కాబట్టి మీరు స్పెషల్ ఆఫీసర్లు గంట, రెండు గంటలు గాని ఈ ప్రాంతంలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలి కానీ ఎక్కడ జరుగుతున్నట్టు కనిపించడం లేదు. మాలాంటివారు ఈ ప్రాంతాల్లో తిరిగి ఈ పనుల పర్యవేక్షణ చేసి, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పై తప్పకుండా దృష్టి పెడతామని అన్నారు.

# తెలంగాణ సెంటిమెంట్‌పై పోరు..

### కవిత ఓటు..ఎవరికి చేటు



**హైదరాబాద్, ఏప్రిల్ 28:**తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన ఆవిర్భావ సభలో ఆమె పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించి, రానున్న రాజకీయాల్లో తాను స్వతంత్ర శక్తిగా ఎదగనున్నట్లు సంకేతాలిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. ఈ క్రమంలో కవిత పెట్టిన పార్టీ ఎవరిని దెబ్బతీస్తుంది అన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది.కవిత తన పార్టీకి 'టీఆర్ఎస్' అని పేరు పెట్టడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. ఒకప్పుడు కేసీఆర్ నేతృత్వంలోని ఉద్యమ పార్టీ 'టీఆర్ఎస్' (తెలంగాణ రాష్ట్ర సమితి) పేరును బీఆర్ఎస్‌గా మార్చుకున్న తర్వాత ఏర్పడిన సెంటిమెంట్ శూన్యాన్ని భర్తీ చేసేందుకు కవిత ఈ వ్యూహాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. 'బీఆర్ఎస్ తన ఆత్మను కోల్పోయింది' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు పాత తరం ఉద్యమకారులను ఆకట్టుకునే ప్రయత్నంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్‌కు అతిపెద్ద ముప్పుగా మారనుందని, పార్టీ ఓటు బ్యాంకును, ముఖ్యంగా కేడర్‌ను కవిత వైపు మళ్లించే అవకాశం ఉందని స్పష్టమవుతోందికవిత తన తొలి ప్రసంగంలో కాంగ్రెస్, బీజేపీలను పక్కనబెట్టి, కేసీఆర్, కేటీఆర్ నాయకత్వాన్ని టార్గెట్ చేయడం గమనార్హం. 'కేసీఆర్ ఇప్పుడు మారు మనిషి అయ్యారు, గుంట నక్కల చేతిలో బందీ అయ్యారు' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు కుటుంబ కలహాల తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఆస్తుల పంపకాల విషయంలో తలెత్తిన విభేదాలే ఈ పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలను, కేటీఆర్, హరీష్‌రావుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించే శ్రేణులను తనవైపు తిప్పుకోవడమే కవిత ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.రాష్ట్రంలో తనదైన ముద్ర ఉన్న కవిత, క్షేత్రస్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నారు. కేసీఆర్ ఇటీవల మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ కార్డును తెరపైకి తెచ్చినప్పటికీ, కవిత అదే సెంటిమెంట్‌ను 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో వాడుకోవడం బీఆర్ఎస్‌కు పెద్ద ఇబ్బందిగా మారింది. ఒకప్పుడు షర్మిల రాజకీయ ప్రవేశం జరిగినప్పటికీ ఆమెకు లభించిన స్పందన కంటే, కవితకున్న సామాజిక గుర్తింపు మరియు తెలంగాణ ఉద్యమకారులతో ఉన్న అనుబంధం కారణంగా, బీఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆమె చీల్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కవిత ఎత్తుగడలు కేసీఆర్ కుటుంబంలోనే కాకుండా, పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.కేసీఆర్ ఇటీవల జీవన్‌రెడ్డి చేరిక సభలో తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. కొత్త ఎత్తులు పనిచేయకపోవడంతో పాత సెంటిమెంటును రగిలించే యత్నం చేశాడు. ఇప్పుడు కవిత కూడా తెలంగాణ సెంటిమెంటును పండిచంఆలనుకుంటుంది. దీంతో బీఆర్ఎస్‌కు ఇది ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. కవితకు తెలంగాణలో మంచి పట్టు ఉంది. ప్రజలను ప్రభావితం చేయగలదు. దీంతో కవిత పార్టీతో ముప్పు ఎదుర్కొనేది బీఆర్ఎస్ పార్టీనే అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**అనుకున్నంతా ఈజీ కాదు...**


ఒక రాజకీయ పార్టీని నడపాలంటే ఒకప్పుడు ఆర్థిక వనరులు అంతగా ఉండాల్సిన అవసరం ఉండదు కాదు. ఎందుకంటే కార్యకర్తలు పార్టీకి పని చేయడాన్ని ఒక గౌరవంగా భావించేవారు. రాజకీయ నాయకులు కూడా ఇప్పటి మాదిరిగా లేరు కాబట్టి.. అప్పుడు అంతగా ఖర్చు ఉండేది కాదు. పైగా దోచుకోవడం, దాచుకోవడం అనే సిద్ధాంతాన్ని నేతలు పాటించేవారు కాదు. దీనివల్ల రాజకీయాలు అంత ఖరీదుగా ఉండేవి కాదు.. మీడియా కూడా న్యూట్రల్ గా ఉండేది. అందువల్ల నాటి రోజుల్లో రాజకీయ పార్టీని నిర్వహించడానికి నేతలకు భారీగా డబ్బు అవసరం పడేది కాదు.ఇప్పటి రోజులు వేరు. ప్రతిదీ ఖరీదుగా మారిపోయింది. పార్టీ కార్యాలయాన్ని నిర్వహించాలి. జిల్లాలో కార్యాలయాలను నిర్వహించాలి. విలేకరుల సమావేశం పెడితే కవర్లు ఇవ్వాలి. సోషల్ మీడియాను రన్ చేయాలి. ప్రత్యర్థి పార్టీల నేతల మీద నిత్యం బురద చల్లుతూనే ఉండాలి. లీగల్ టీం బలోపేతంగా ఉండాలి. అన్నింటికీ మించి దండిగా సంపాదించుకోవాలి. తరాలు తిని కూర్చున్నా కూడా తగ్గని ఆస్తులను వెనకేసుకోవాలి. ఇదంతా జరగాలంటే దోపిడీ చేయాలి. దుర్మార్గాలకు పాల్పడాలి. అక్రమాలకు శ్రీకారం చుట్టాలి. అందువల్లే రాజకీయ నాయకులు అంటే ప్రజల్లో చులకన భావం.. మేధావుల్లో హేయమైన భావం.తెలంగాణ రాష్ట్రంలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు అయింది. ఈ పార్టీని ఏర్పాటు చేసింది తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత. తన పార్టీ పేరును ఆమె టిఆర్ఎస్ గా ప్రకటించారు. వాస్తవానికి ఒక మహిళ రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం మన దేశంలో కొత్తగాక పోయినప్పటికీ.. మఘలో పుట్టి పుబలో మునిగిపోయిన మాదిరిగా కాకుండా.. రాజకీయ పార్టీ సుదీర్ఘకాలం పనిచేయాలంటే కచ్చితంగా ఆర్థిక వనరులు ఉండాల్సిందే. కవిత పార్టీ ఏర్పాటు చేశారు కాబట్టి ఆమె దానిని కొనసాగించగలుగుతారా.. ఆమె దగ్గర ఉన్న ఆర్థిక స్థాయి ఎంత.. తెర వెనుక ఏవైనా భారీ అండదండలు ఉన్నాయా.. అనే ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా వ్యక్తం అవుతున్నాయి.రాజకీయ పార్టీని ఏర్పాటుచేసిన కవిత ఆర్థిక పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే.. 2021లో ఎమ్మెల్సీ ఎలక్షన్ అఫిడవిట్ లో ఆమె తన పేరు మీద 39.79 కోట్ల ఆస్తులు ఉన్నాయని ప్రకటించారు. 21.62 కోట్ల అప్పులు ఉన్నాయని వెల్లడించారు. 1.9 కిలోల బంగారం, 11.2 కిలోల వెండి ఉన్నట్టు వెల్లడించారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో 6.19 కోట్ల ఆస్తులు.. 2019 ఎన్నికల్లో 17.9 3 కోట్ల ఆస్తులు.. 2020లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 27.64 కోట్ల ఆస్తులు ఉన్నట్టు కవిత వెల్లడించారు. అయితే ఈ స్థాయి ఆస్తులతో రాజకీయ పార్టీని ఎలా నడుపుతారని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఆమె పార్టీలో ఆర్థికంగా బలంగా ఉన్న నాయకులు కనిపించడం లేదు. ఆమె చెప్పినట్టుగా గొప్ప గొప్ప నాయకులు పార్టీలో చేరలేదు. ఇప్పటికైతే పార్టీలో పెట్టుబడి పెట్టాల్సింది.. నిర్వహణ ఖర్చు చూసుకోవాల్సింది మొత్తం కవితనే. పైగా ఆర్థికంగా కవిత బలంగానే ఉన్నప్పటికీ.. అధికార పార్టీని.. ప్రతిపక్ష పార్టీని ఆమె ఏక కాలంలో విమర్శిస్తున్నారు. అలాంటప్పుడు ఆమెకు ఆర్థికంగా సహాయం చేయడానికి ఎవరు ముందుకు వస్తారు.. ఒకవేళ వచ్చినా ప్రభుత్వం ఒత్తిడికి వారు తట్టుకుంటారా.. ప్రతిపక్షం దూకుడు ముందు నిలబడతారా.. వీటిని సమర్థవంతంగా ఎదుర్కొంటేనే కవితకు, ఆమె రాజకీయ పార్టీకి మనగడం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు."పార్టీ ఆవిర్భావ సభను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వంటకాలు మొత్తం కార్యకర్తలకు వడ్డించారు. కార్యకర్తలు కూడా భారీగానే వచ్చారు. జన సమీకరణ అనుకున్న దానికంటే ఎక్కువగానే చేశారు. పత్రికలలో భారీగా ప్రకటనలు ఇచ్చారు. ఇవన్నీ చూస్తుంటే కవిత అంత ఈజీగా లేరు. పైగా తను కేసీఆర్ కుమార్తె. అలాంటప్పుడు ఆమె తన పార్టీని గట్టిగానే నిర్వహిస్తారు. కెసిఆర్ కూడా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. చివరికి పార్టీని బలోపేతం చేసుకున్నారు. కవిత కూడా అలానే ఉంటుందేమో. ఎందుకంటే తను మాట్లాడుతున్న ప్రతి మాటలో కూడా స్పష్టత కనిపించింది. ధిక్కార స్వభావం వినిపించింది. అలాంటప్పుడు కవిత కచ్చితంగా పార్టీని బలోపేతం చేసుకుంటుందని నమ్మకం కనిపిస్తోందని" విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మహానగరం



**హైదరాబాద్, ఏప్రిల్ 28:**హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'హెచ్-సిటీ' ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం రూ. 7,042 కోట్ల భారీ బడ్జెట్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఫ్లైఓవర్లు, అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైంది. నల్లగొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకు చేపట్టిన కీలక ఫ్లైఓవర్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. యుద్ధప్రాతిపదికన ఈ పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.హైదరాబాద్ మహా నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' పేరుతో తెలంగాణ ప్రభుత్వం భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం కింద మొదలై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులతో పాటు.. ప్రస్తుతం కొత్తగా గుర్తించిన ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ మూడు కార్పొరేషన్ల పరిధిలోని ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేసేందుకు ముగ్గురు కమిషనర్లు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు.ఈ భారీ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం మొత్తం రూ. 7,042 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో సింహభాగం.. అంటే సుమారు రూ. 5,942 కోట్లను హెచ్-సిటీ పనులకే కేటాయించింది. ప్రధానంగా జూబ్లీహిల్స్ ప్రాంతంలోని కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి రూ. 1,090 కోట్లతో చేపట్టిన పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో రూ. 580 కోట్లతో కేబీఆర్ ఎంట్రెన్స్, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వంటి కీలక జంక్షన్లలో రెండు స్టీల్ బ్రిడ్జిలు, మూడు అండర్ పాసులను నిర్మించనున్నారు. రెండో ప్యాకేజీలో రూ. 510 కోట్లతో ఫిల్మ్ నగర్, రోడ్డు నంబర్ 45 జంక్షన్ల వద్ద మరో నాలుగు స్టీల్ బ్రిడ్జిలు, నాలుగు అండర్ పాసులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. ట్రాఫిక్ మళ్లింపులు కూడా చేపట్టారు.మరోవైపు దక్షిణ హైదరాబాద్ ప్రజలు చాలా కాలంగా ఎదురు చూస్తున్న నల్లగొండ ఎక్స్ రోడ్స్--సైదాబాద్--ఐఎస్ సదన్ --ఓవైసీ జంక్షన్ కారిడార్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. సుమారు 2,530 మీటర్ల పొడవుతో నిర్మిస్తున్న ఈ ప్రధాన ఫ్లైఓవర్‌ను రూ. 620 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. సైదాబాద్ నుంచి ధోబీఘాట్ జంక్షన్ వరకు ఉన్న కీలక ప్రాంతాల్లో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ, కొత్త నగరం మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. గడువులోగా ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటమే లక్ష్యంగా, నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మార్చేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది.

# వర్క్ ఫ్రమ్ హోమ్ కు డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 28:**పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలతో పాటు భారత్‌లోనూ చమురు, గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చమురు కంపెనీలు పెట్రోల్ బంకులకు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్ నిబంధనలు మార్చడంతో చాలా రాష్ట్రాల్లో ఇబ్బందులు మొదలయ్యాయి. ఏపీతోపాటు తెలంగాణ రాజధాని హైదరాబాద్ లోనూ పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా వేదిస్తోంది. బంకుల వద్ద వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్ర మవుతున్న నేపథ్యంలో వర్క్ ఫ్రమ్ హోం డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.గతంలో కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించింది. ఈ సమయంలో ఉద్యోగులకు కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చాయి. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో రవాణా వ్యవస్థ స్తంభించి పోతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది.పెట్రోల్, డీజిల్ కొరతతో పాటు ఎండలు కూడా మండిపోతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9గంటల తరువాత బయటకు వచ్చేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోంను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు కోరుతున్నారు.పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమైతే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించేందుకు కేంద్రం మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే, లాక్ డౌన్ కంటే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. వర్క్ ఫ్రమ్ హోం విధానం వల్ల పెట్రోల్, డీజిల్ కొరతతో ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి బయటపడంతోపాటు ఎండల నుంచి రక్షణ పొందొచ్చని, మరోవైపు ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టొచ్చని, పొల్యూషన్ తగ్గుతుందని పలువురు నెటిజన్లు సూచిస్తున్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

## మానవత్వం వదిలారు.. పిల్లలనూ వదిలేసారు

**కరీంనగర్:**కరీంనగర్ జిల్లాలో కన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు మానవత్వం మరిచారు. కన్న బిడ్డలను పోలీస్ స్టేషన్లో వదిలేసి వెళ్ళిపోయారు. తిమ్మాపూర్ మండలం అల్లనూరులో భర్త, పిల్లలు వద్దంటూ తాళి, మెట్టెలు తీసేసి తల్లి లలిత వెళ్లిపోయింది. దీంతో పిల్లలు తనకూ వద్దంటూ ఎల్.ఎం.డీ పోలీస్ స్టేషన్లో వదిలి తండ్రి రవి వెళ్లిపోయాడు. రవి, లలితలను పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విబేధాలు వచ్చాయి. దాంతో కథ పోలీసు స్టేషన్ చేరింది. తల్లిదండ్రులు వదిలి వెళ్లడంతో చిన్నారులు బిక్కు బిక్కుమంటూ పోలీస్ స్టేషన్లో గడిపారు. చివరకు పోలీసులు నాన్నమ్మను పిలిచి పిల్లలను అప్పగించారు.

## ఉమ్మడి వరంగల్ బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్ భేటి

**వరంగల్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశమైయారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రధానంగా చర్చ జరిగింది. సభ్యత్వ నమోదు, ప్రతి గ్రామం మరియు వార్డులో పార్టీని మరింత బలోపేతం చేయడంపై నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేసారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులను సమీక్షించారు. అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో పార్టీ పోషించాల్సిన పాత్రపై చర్చ జరిపారు.

# దోమలు మనుషులను ఎలా గుర్తించి కుడతాయి..? సైంటిస్టుల ఆసక్తికర పరిశోధన..



దోమలు మనుషులను ఎలా గుర్తించి కుడతాయో తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు చేసిన తాజా అధ్యయనం ఆసక్తికర విషయాలను బయటపెట్టింది. ఇప్పటివరకు దోమలు ఒకదానిని ఒకటి అనుసరిస్తాయని అనుకునే వారు, కానీ ఈ పరిశోధన ఆ భావనను పూర్తిగా మార్చేసింది. అసలు విషయానికి వస్తే, దోమలు నాయకుడిని అనుసరించవని, పర్యావరణ సంకేతాలను అనుసరిస్తాయని పరిశోధకులు తెలియజేస్తున్నారు. అమెరికాలోని జార్జియా టెక్, మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కి చెందిన పరిశోధకులు అధిక సంఖ్యలో దోమలను పరిశీలించి, సుమారు 20 మిలియన్ల డేటా పాయింట్లను విశ్లేషించారు. ఈ అధ్యయనంలో ముఖ్యంగా ఆడ ఏడిస్ ఈజిప్టై దోమల ప్రవర్తనను పరిశీలించారు. ఈ దోమలే సాధారణంగా యెల్లో ఫీవర్ వంటి వ్యాధులను వ్యాపింపజేస్తాయి.

**3డీ ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలతో..**

పరిశోధకులు 3డీ ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను ఉపయోగించి, దోమలు మనుషుల చుట్టూ ఎలా కదులుతాయో గమనించారు. ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్ వాసన, విజువల్ సంకేతాలు (రంగులు, ఆకారాలు) దోమలను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తించారు. ఒక మనిషిని కంట్రోల్డ్ ఛాంబర్‌లో ఉంచి, అతని దుస్తుల రంగులను మార్చుతూ పరీక్షలు నిర్వహించారు. ఈ పరిశోధనలో కీలకమైన విషయం ఏమిటంటే ప్రతి దోమ స్వతంత్రంగా స్పందించింది. అవి గుంపుగా కనిపించినా, ఒకదానిని ఒకటి అనుసరించడం వల్ల కాదు. ఒకే రకమైన సంకేతాలకు ఆకర్షితమై, అవన్నీ ఒకే ప్రదేశానికి చేరుకుంటాయి. అంటే, అవి ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఉండటం యాదృచ్ఛికం కాదు, కానీ ఒకే కారణం వల్ల జరుగుతుంది. ఈ విషయాన్ని శాస్త్రవేత్తలు ఒక ఉదాహరణతో వివరించారు. బిజీగా ఉన్న బార్‌లో ఉన్నవాళ్లు ఒకరిని ఒకరు అనుసరించి రారు. అక్కడ ఉన్న సంగీతం, వాతావరణం, పానీయాలు వారిని ఆకర్షిస్తాయి. అదే విధంగా దోమలు కూడా సంకేతాలను అనుసరిస్తాయి.. అని చెప్పారు.

**గణిత మోడల్ రూపకల్పన..**

ఈ అధ్యయనం ద్వారా దోమలు ఎలా నిర్ణయం తీసుకుంటాయో అర్థం చేసుకోవడానికి గణిత మోడల్ కూడా రూపొందించారు. భవిష్యత్తులో ఇది మెరుగైన పెస్ట్ కంట్రోల్ పద్ధతులను అభివృద్ధి చేయడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా మలేరియా, జికా, యెల్లో ఫీవర్ వంటి ప్రమాదకర వ్యాధులను వ్యాపింపజేసే దోమలను నియంత్రించడంలో ఇది ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలు తీస్తున్న ఈ దోమలపై నియంత్రణ సాధించేందుకు ఈ పరిశోధన కీలక అడుగుగా మారుతుందని అంచనా వేస్తున్నారు.

# ఒకేసారి ఎక్కువ సమయం పాటు వ్యాయామం చేయలేరా.. అయితే మినీ వర్కవుట్లు చేయండి..



బిజీ జీవితంలో వ్యాయామానికి సమయం కేటాయించడం చాలా మందికి సవాలుగా మారుతోంది. ఉద్యోగం, ప్రయాణం, రోజువారీ బాధ్యతల మధ్య 30 నుంచి 60 నిమిషాల పాటు వ్యాయామం చేయడం సాధ్యపడడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్సర్‌సైజ్ స్నాకింగ్ అనే కొత్త ఫిట్‌నెస్ ట్రెండ్ ప్రజల్లో ప్రాచుర్యం పొందుతోంది. ఎక్సర్‌సైజ్ స్నాకింగ్ అంటే రోజంతా చిన్న చిన్న విరామాల్లో తక్కువ సమయం పాటు వ్యాయామం చేయడం. ఒకేసారి ఎక్కువసేపు వ్యాయామం చేయకుండా, రోజులో అనేక సార్లు చిన్న చిన్న శారీరక కార్యకలాపాలు చేయడం ఈ విధానం ముఖ్య లక్ష్యం. సాధారణంగా 30 సెకన్ల నుంచి కొన్ని నిమిషాల వరకు చేసే ఈ మినీ వర్కౌట్లు శరీరాన్ని చురుకుగా ఉంచుతాయి. ఈ విధానంలో మెట్లు ఎక్కడం, స్క్వాట్స్, లంజెస్ చేయడం, పుష్-అప్స్ చేయడం లేదా వేగంగా నడక వంటి సులభమైన వ్యాయామాలు ఉంటాయి. దీని ప్రధాన ఉద్దేశ్యం ఎక్కువసేపు కూర్చునే అలవాటును తగ్గించి, శరీరాన్ని తరచుగా కదిలించడం. ఆధునిక జీవనశైలి ఎక్కువగా కూర్చునే విధంగా మారింది. ఇది మెటబాలిజం, శరీర భంగిమ, మొత్తం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఎక్సర్‌సైజ్ స్నాకింగ్ సులభమైన, సమయాన్ని ఆదా చేసే పరిష్కారంగా మారింది. దీని ద్వారా వ్యాయామం చేయాలనే ఒత్తిడి తగ్గి, అందరికీ సులభంగా అనుసరించగల మార్గంగా ఉంటోంది. ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, ఈ చిన్నకాలిక కానీ అధిక తీవ్రత కలిగిన వ్యాయామాలు శరీరంలోని అనేక వ్యవస్థలను ఒకేసారి ఉత్తేజపరుస్తాయి. దీని వల్ల సాధారణంగా కూర్చునే జీవనశైలిలో కనిపించని శారీరక మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ విధానం వల్ల కండరాలు ఆక్సిజన్, గ్లూకోజ్‌ను మెరుగ్గా వినియోగించుకుంటాయి. కండరాల వృద్ధి కూడా మెరుగుపడుతుంది. అలాగే నాడీ వ్యవస్థ, కండరాల మధ్య కమ్యూనికేషన్ వేగం పెరుగుతుంది. పరిశోధనలు సూచిస్తున్నట్లుగా, ఈ చిన్న చిన్న వ్యాయామాలు కూడా గుండె ఆరోగ్యం మెరుగుపరచడంలో, మెటబాలిజాన్ని పెంచడంలో, కండరాల బలం పెంచడంలో సహాయపడతాయి.

# పచ్చి మామిడి వర్సెస్ మామిడి పండు.. ఏయే పదార్థాల తయారీకి వేటిని వాడాలి..



మామిడి సీజన్ ప్రారంభమైతే మార్కెట్లు పచ్చి మామిడిపండ్ల నుంచి పండిన తీయని మామిడిపండ్లతో నిండిపోతాయి. ప్రతి ఒక్కరు వారికి నచ్చినవి కొనుగోలు చేసి వాటి రుచిని ఆస్వాదిస్తూ ఉంటారు. ఈ రెండింటికీ ప్రత్యేకమైన రుచి ఉండడంతోపాటు వంటల్లో వీటి ఉపయోగం కూడా వేరుగా ఉంటుంది. పచ్చి మామిడి తియ్యని, పులుపు రుచిని అందిస్తే, పండిన మామిడి సహజమైన తీపి, మృదుత్వాన్ని అందిస్తుంది. అందువల్ల వీటిని ఒకే పండుగా కాకుండా, వేర్వేరు పదార్థాలుగా చూడటం ఉత్తమం. పచ్చి మామిడి ప్రధానంగా పులుపు, కరకరలాడే టెక్స్చర్‌తో ఉంటుంది. అందుకే వంటల్లో తాజాదనాన్ని తీసుకురావడానికి ఇది ఉపయోగపడుతుంది. వేసవిలో పచ్చి మామిడి ఉల్లాసాన్ని పెంచే రుచిని అందిస్తుంది. పచ్చి మామిడితో చేసే వంటల్లో ఆవకాయలు, పచ్చళ్ళు ముఖ్యమైనవి. కాయ గట్టిగా ఉండటం వల్ల మసాలాలు, నూనె కలిసిపోతాయి. పచ్చి మామిడి చట్నీలు కూడా భోజనానికి రుచిని పెంచుతాయి.

**ఆమ్ పన్నా ఆరోగ్యకరం..**

సలాడ్లు, కచుంబర్‌లలో తురిమిన పచ్చి మామిడి కలిపితే రుచిలో ప్రత్యేకమైన మార్పు వస్తుంది. క్యారెట్, కీరదోసకాయ, పల్లీలు వంటి పదార్థాలతో కలిపితే కరకరలాడే, రుచికరమైన మిశ్రమంగా మారుతుంది. దాల్, కర్రీలలో కూడా పచ్చి మామిడి ఉపయోగిస్తారు. ఇది వంటకానికి తేలికపాటి పులుపును అందించి, రుచిని సమతుల్యం చేస్తుంది. కొబ్బరి ఆధారిత కర్రీల్లో ఇది తేలికపాటి తీపి-పులుపు సమతుల్యతను కలిగిస్తుంది. అలాగే వేసవిలో పచ్చి మామిడితో చేసే పానీయాల్లో ఆమ్ పన్నా ముఖ్యమైనది. ఇది శరీరానికి చల్లదనం ఇవ్వడంతోపాటు తక్షణ శక్తిని అందిస్తుంది. బెల్లం, మసాలాలు కలిపి తయారు చేసే ఈ పానీయం వేసవిలో ప్రత్యేకమైన ఉపశమనాన్ని ఇస్తుంది.

**అల్పాహారంగా పనిచేసే మామిడి పండ్లు..**

ఇక పండిన మామిడి తీపి, సువాసన, మృదుత్వంతో వంటల్లో ప్రధాన పాత్ర పోషిస్తుంది. దీన్ని డెజర్ట్‌లోనూ, పానీయాల్లోనూ విస్తృతంగా ఉపయోగిస్తారు. శ్రీఖండ్, కలాకండ్ వంటి మిఠాయిల్లో పండిన మామిడి అద్భుతంగా సరిపోతుంది. మామిడిని క్రీమ్‌తో కలిపినా, కేకులు, మఫిన్స్‌ల్లో వాడినా ప్రత్యేకమైన రుచి ఇస్తుంది. స్మూతీలు, లస్సీలు, బౌల్స్‌లో పండిన మామిడి గట్టిగా, క్రీమీ టెక్స్చర్‌ను ఇస్తుంది. పెరుగు, పాలు లేదా కొబ్బరితో కలిపి తీసుకుంటే పోషకాహారంగా ఉంటుంది. ఇవి వేసవిలో త్వరగా తయారయ్యే అల్పాహారంగా కూడా ఉపయోగపడతాయి. పండిన మామిడితో సాల్సాలు, టాపింగ్స్ కూడా తయారు చేయవచ్చు. ఉల్లిపాయలు, కొత్తిమీర, నిమ్మరసం, మిరపకాయలతో కలిపితే తీపి-కారం సమతుల్యతతో వంటకానికి కొత్త రుచిని అందిస్తుంది.

# మహిళలు తమ ఆరోగ్యం కోసం ఈ మొక్కలను తమ జీవితంలో భాగం చేసుకోవాలి



మహిళల ఆరోగ్యం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. హార్మోన్ల మార్పులు, జీవనశైలి, రోజువారీ పనులు, భావోద్వేగ పరిస్థితులు వంటివి అన్నీ కలిసి శరీర సమతౌల్యాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతం చాలా మంది మహిళలు మూడ్ మార్పులు, అలసట, నిద్రలో అంతరాయం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు దీర్ఘకాలంలో హార్మోన్ల అసమతౌల్యం, జీర్ణక్రియ లోపాలు, శరీర శక్తి తగ్గుదలకు దారితీస్తాయి. ఈ నేపథ్యంలో ఆయుర్వేదం సహజమైన పరిష్కారాలను అందిస్తుంది. ఆయుర్వేద నిపుణులు సూచించిన ప్రకారం, మహిళలు రోజువారీ ఆహారంలో కొన్ని ప్రత్యేక ఔషధ మొక్కలను చేర్చుకుంటే ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. ఈ మూడు ముఖ్యమైన మొక్కలు హార్మోన్ల సమతౌల్యాన్ని మెరుగుపరచడంలో, ఒత్తిడిని తగ్గించడంలో, మొత్తం శరీర ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. మహిళలు రోజువారి ఆహారంలో చేర్చుకోవాల్సిన ముఖ్యమైన మొక్కల గురించి నిపుణులు వివరిస్తున్నారు.

**అశ్వగంధ, శతావరి..**

మహిళలు తీసుకోవాల్సిన మొక్కల్లో మొదటిది అశ్వగంధ మొక్క. ఇది శక్తివంతమైన అడాప్టోజెన్‌గా పనిచేస్తుంది. ఇది ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అధిక కార్టిసోల్ స్థాయిలను నియంత్రించడంతోపాటు నర్వస్ సిస్టమ్‌ను సమతుల్యం చేస్తుంది. థైరాయిడ్, అడ్రినల్ గ్రంథుల పనితీరును మెరుగుపరచడంలో కూడా అశ్వగంధ సహాయపడుతుంది. శక్తి, ఉత్సాహం పెరగడమే కాకుండా భావోద్వేగ స్థిరత్వాన్ని కూడా ఇది పెంపొందిస్తుంది. ఇక రెండవది శతావరి. దీనిని హెర్బ్స్ క్వీన్ అని పిలుస్తారు. మహిళల ఆరోగ్యానికి ఇది ప్రత్యేకంగా ఉపయోగకరంగా ఉంటుంది. పీసీవోఎస్, వంధ్యత్వ సమస్యలు, గైనకాలజీ సమస్యలు, మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు ఇది ఉపశమనాన్ని అందిస్తుంది. హార్మోన్ల సమతౌల్యాన్ని కాపాడటంలో, ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గించడంలో, ఓవరీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో శతావరి ముఖ్య పాత్ర పోషిస్తుంది. అలాగే పీరియడ్స్ సమస్యలు, పీఎంఎస్ లక్షణాలను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది.

**తులసి..**

ఇక మూడవది తులసి. ప్రతి భారతీయ ఇంట్లో దొరికే ఈ ఔషధ మొక్క అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. తులసి ఒత్తిడి, ఆందోళన తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది సెరటోనిన్ ఉత్పత్తిని పెంచి మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. అలాగే జీర్ణక్రియను మెరుగుపరచడం, మెటబాలిజం పెంచడం, ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడడం వంటి ప్రయోజనాలు కూడా కలిగి ఉంటుంది. ఈ మూడు మొక్కలను రోజువారీ జీవితంలో చేర్చుకోవడం ద్వారా మహిళలు శరీర, మానసిక ఆరోగ్యాన్ని సమతుల్యం చేసుకోవచ్చు. హార్మోన్ల సమతౌల్యం, మెరుగైన నిద్ర, మంచి జీర్ణక్రియ, శారీక శక్తి పెరగడం వంటివన్నీ కూడా ఈ ఔషధాలను తీసుకోవడం ద్వారా సాధ్యమవుతాయి. సహజమైన ఈ మార్గాలు మహిళల ఆరోగ్యాన్ని నెమ్మదిగా, కానీ స్థిరంగా మెరుగుపరచడంలో సహాయపడతాయని ఆయుర్వేద నిపుణులు తెలియజేస్తున్నారు.

## బిజినెస్

### గేమర్స్, యువత కోసం జియో న్యూ ప్లాన్..

ప్రముఖ టెలికామ్ సంస్థ రిలయన్స్ జియో గేమర్స్‌ను, యువతను లక్ష్యంగా చేసుకుని సరికొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 'జియో యూత్ అండ్ గేమింగ్ ప్లాన్ పేరుతో వచ్చిన ఈ ప్లాన్ ధరను రూ.459 గా నిర్ణయించింది. డేటాతోపాటు గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయోజనాలను కూడా ఈ ప్లాన్‌లో అందిస్తున్నారు. ప్లాన్ వివరాల్లోకి వెళ్తే.. రూ.459 రీచార్జ్‌తో 28 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. ఈ సమయంలో వినియోగదారులకు మొత్తం 61 జీబీ హైస్పీడ్ డేటా అందుబాటులో ఉంటుంది. రోజుకు 2 జీబీ చొప్పున 56 జీబీ డేటాతో పాటు.. అదనంగా మరో 5 జీబీ డేటా కూడా అందిస్తారు. అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా ఈ ప్లాన్‌లో భాగంగా ఉన్నాయి. ఈ ప్లాన్ ద్వారా జియో గేమ్స్, క్లౌడ్ గేమింగ్ యాక్సెస్‌ను మై జియో యాప్‌లో పొందవచ్చు. వీటితోపాటు మూడు నెలలపాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, స్నాప్‌చాట్‌ం సబ్‌స్క్రిప్షన్ ఉచితంగా లభిస్తాయి. ముఖ్యంగా సుమారు రూ.35,100 విలువైన గూగుల్ జెమినీ ప్రో యాక్సెస్‌ను 18 నెలలపాటు ఉచితంగా అందిస్తుండటం ఈ ప్లాన్‌లో ప్రధాన ఆకర్షణగా చెప్పవచ్చు. గేమింగ్, సోషల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయోజనాలను ఒకేచోట అందించడం ద్వారా యువత సెగ్మెంట్‌లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని జియో భావిస్తోంది. ఆసక్తి ఉన్న వినియోగదారులు మై జియో యాప్ లేదా జియో అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ ప్లాన్‌ను రీచార్జ్ చేసుకునే అవకాశం ఉన్నది.




### స్నాప్‌చాట్‌కు పోటీగా.. ఇన్‌స్టా కొత్త యాప్

ఇంటర్నెట్ డెస్క్: మెటాకు చెందిన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఇన్‌స్టాగ్రామ్ కు యువతలో ఉన్న క్రేజ్ గురించి వేరే చెప్పక్కర్లేదు. తాజాగా ఈ ప్లాట్‌ఫాం వినియోగదారుల కోసం కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. స్నాప్‌చాట్‌కు పోటీగా ఇన్‌స్టాలోనూ 'ఇన్‌స్టాంట్స్' పేరుతో క్విక్ ఫొటో షేరింగ్ యాప్‌ను ప్రారంభించింది. దీని సహాయంతో వినియోగదారులు యాప్‌లోని కెమెరాను ఉపయోగించి ఒకే ట్యాప్‌తో ఫొటోలు తీసుకోవచ్చు. వీటిని షేర్ చేసిన అనంతరం చాట్ లిస్ట్‌లో 24 గంటల పాటు ఉండి ఆ తర్వాత వాటంతట అవే డిలీట్ అవుతాయి. అయితే ఈ యాప్‌లో ఎడిటింగ్ ఫీచర్లను ఇన్‌స్టాగ్రామ్ అందుబాటులోకి తీసుకురాలేదు. తాము తీసిన ఫొటోలకు వినియోగదారులు కేవలం టెక్స్ట్ మాత్రమే జోడించగలరు. 'ఇన్‌స్టాంట్స్' యాప్‌లోని కెమెరాను ఉపయోగించి తీసిన చిత్రాలను మాత్రమే షేర్ చేయగలరు. ఒకేసారి పలువురు మిత్రులతో వీటిని పంచుకోవచ్చు. మొబైల్ గ్యాలరీలోని ఫొటోలను అప్‌లోడ్ చేసే అవకాశం ఉండదు. ప్రస్తుతం ఈ యాప్ స్పెయిన్, ఇటలీలోని ఆండ్రాయిడ్ ఐఓఎస్ (ఐూూ) వినియోగదారులకు అందుబాటులో ఉంది. త్వరలోనే ఇతర దేశాల్లోనూ ఈ సేవలు విస్తరించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఈ ఫీచర్‌తో స్నాప్‌చాట్, లాకెట్, బీరియల్ వంటి యాప్‌లు ఉన్నాయి. యువతకు మరింత దగ్గరయ్యేందుకు ఇన్‌స్టా కూడా ఈతరహా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.




# అపార్ట్‌మెంట్ల ధరలు పెరిగే అవకాశం!




పశ్చిమ ఆసియా యుద్ధం నేపథ్యంలో నిర్మాణ రంగం కష్టాల్లో కూరుకుపోయింది. అసలే మార్కెట్ లేక అయోమయంలో ఉన్న బిల్డర్లకు యుద్ధం రూపంలో మరో బాంబ్ పేలింది. దాంతో సామాన్య మధ్యతరగతి ప్రజల సొంతింటి కల చెదిరే పరిస్థితులు ఏర్పడ్డాయి. నిర్మాణ రంగంలో అన్ని వస్తువుల ధరలు పెరిగిపోవడంతో రానున్న రోజుల్లో ఇళ్లు, ఫ్లాట్ల ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ వంటి ముడి చమురు, సహజ వాయువు కొరత, సరుకు రవాణాకు అంతరాయం, తగ్గిన ముడి పదార్థాల దిగుమతులు నిర్మాణ రంగాన్ని షేక్ చేస్తున్నాయి. ఇంధన వనరులపై ఆధారపడిన నిర్మాణ సామగ్రి తయారీ సంస్థలపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీంతో సిమెంట్, స్టీల్, అల్యూమినియం, శానిటరీ, రంగులు, ప్లంబింగ్ పైపులు, యూపీవీసీ వంటి గృహ నిర్మాణ సామగ్రి ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. నెల రోజుల వ్యవధిలో ఆయా ఉత్పత్తుల ధరలు 20--50 శాతం మేర పెరిగిపోయాయి. దీంతో నిర్మాణ వ్యయం అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయి గృహ నిర్మాణదారులు, డెవలపర్లు హడలెత్తిపోతుండగా, వారు ఇళ్లు, ఫ్లాట్ల ధరలు పెంచక తప్పని పరిస్థితి నెలకొంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఉత్పత్తుల తయారీలో చమురు కీలకం..**

నిర్మాణ రంగంలో సిమెంట్, స్టీల్ తయారీ దేశీయంగానే ముడి పదార్థాలపై ఆధారపడి ఉండటంతో ఆయా ఉత్పత్తులపై పెద్దగా ప్రభావం లేదు. కానీ రవాణా అంతరాయం కారణంగా వీటి ధరలు 10--15 శాతం వరకు పెరిగాయి. కాగా టైల్స్, శానిటరీ, అల్యూమినియం, రంగులు, యూపీవీసీ, పీవీసీ పైపులు, ఎలక్ట్రిక్ వైర్లు వంటి ఉత్పత్తుల తయారీలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ అత్యంత కీలకంప్రస్తుతం గల్ఫ్ దేశాల నుంచి చమురు సరఫరా తగ్గడంతో ఆయా ఉత్పత్తుల తయారీపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీంతో పీవీసీ కోసం ఇతర దేశాల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా దిగుమతి చేసుకునే యూపీవీసీ కిటికీలు, తలుపులు, గ్లాస్‌లు, శానిటరీ వేర్ వంటి వాటి ధరలు 40 శాతం పైనే పెరిగాయి. మొత్తం మీద నిర్మాణ సామగ్రి సరఫరాలో అంతరాయం, కొరత కారణంగా భవన నిర్మాణ వ్యయం 15--20 శాతం మేర పెరిగింది. ఈ భారాన్ని డెవలపర్లు చివరిగా గృహ కొనుగోలుదారులకు బదిలీ చేయడం తప్పనిసరి. ఫలితంగా అపార్ట్‌మెంట్ల ధరలు చదరపు అడుగు (చ.అ.)కు రూ.250--300 వరకు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

**ఎన్నికల ప్రభావం**

నిర్మాణ సామగ్రి సరఫరాలో అంతరాయంతో పాటు నిర్మాణ రంగంపై ఎన్నికల ప్రభావం కూడా పడింది. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం వంటి రాష్ట్రాలలో ఎన్నికల నేపథ్యంలో నిర్మాణ రంగ కార్మికులు సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో నిర్మాణ కార్యకలాపాలు నెమ్మదించాయి. నిర్మాణ వ్యయం, వినియోగ ఖర్చులు, వడ్డీల భారం డెవలపర్లపై పడుతోంది. దీంతో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు డెవలపర్లకు అధిక పెట్టుబడులు అవసరం అవుతాయి. దీంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మరో ఆరు నెలల పాటు ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే నిర్మాణ సామగ్రి తయారీ సంస్థలు కుదేలవడంతో పాటు వడ్డీ రేట్లు పెరిగే ప్రమాదం కూడా ఉందని చెబుతున్నారు.

## యాక్సిస్ బ్యాంకు లాభం రూ.7,071 కోట్లు.. డివిడెండ్ రూ.1




ప్రముఖ ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంకు 2025-26 చివరి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసకంలో రూ.7,071 కోట్ల నికరలాభాన్ని నమోదుచేసింది. అంతకుముందు ఇదే కాలంలో నమోదైన రూ.7,117 కోట్లతో పోలిస్తే 0.6 శాతం తగ్గుదల నమోదైంది. బలహీనమైన వడ్డీయేతర ఆదాయం, అధిక కేటాయింపులే ఇందుకు కారణంగా బ్యాంక్ పేర్కొంది. అయితే గత డిసెంబర్ త్రైమాసికం నికర లాభం రూ.6,489.57 కోట్లతో పోలిస్తే 9 శాతం వృద్ధి సాధించింది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 5% పెరిగి 14,457 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ 2 బేసిస్ పాయింట్ల మేర తగ్గి 3.62 శాతానికి చేరింది. బ్యాలెన్స్ షీట్ బలోపేతానికి అదనంగా రూ.2001 కోట్ల ప్రొవిజన్లను కేటాయించినట్లు బ్యాంకు పేర్కొంది. దీంతో మార్చి త్రైమాసికంలో ప్రొవిజన్లు రూ.3,522 కోట్లకు చేరాయి. బ్యాంకులో మొండి బకాయిలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే రూ.6007 కోట్ల నుంచి రూ.4,709 కోట్లకు తగ్గాయి. దీంతో రుణాల నాణ్యత మెరుగుపడింది. కార్యకలాపాల లాభం గతేడాదితో పోలిస్తే 7 శాతం తగ్గి రూ.10,013 కోట్లకు చేరింది. ఖర్చులు 6 శాతం పెరిగాయి. మార్చి త్రైమాసికంలో రూ.606 కోట్ల ట్రేడింగ్ నష్టాల వల్ల వడ్డీయేతర ఆదాయం దెబ్బతిన్నట్లు బ్యాంకు పేర్కొంది. వాటాదారులకు ప్రతి షేరుకు రూ.1 డివిడెండ్ సిఫార్సు చేసినట్లు ప్రకటించింది. మొత్తంగా చూస్తే, అధిక ప్రొవిజన్లు, ట్రేడింగ్ నష్టాలతో వార్షిక లాభం తగ్గినప్పటికీ, నికర వడ్డీ ఆదాయం, ఆస్తి నాణ్యత విషయంలో బ్యాంకు మెరుగైన ఫలితాలను కనబరిచింది. డిజిటల్ లావాదేవీల్లో బ్యాంకు తన హవా కొనసాగిస్తోంది. మార్చి త్రైమాసికంలో 10 లక్షలకు పైగా క్రెడిట్ కార్డు యూజర్లను కొత్తగా నమోదు చేసింది

## అజేయ శతకంతో రాహుల్ విధ్వంసం..

# పంజాబ్ ముందు రికార్డు లక్ష్యం..!





సొంత మైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కేఎల్ రాహుల్(152 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగి శతకంతో గర్జించాడు. అరుణ్ జైట్లీ స్టేడియంలో అభిమానులను బౌండరీల వర్షంలో మంచెత్తిన రాహుల్ పంజాబ్ కింగ్స్ బౌలర్లకు మూడు చెరువుల నీళ్లు తాగించాడు. పటిష్టమైన పంజాబ్ బౌలింగ్ దళాన్ని తుత్తునియలు చేసిన రాహుల్.. రెండో వికెట్‌కు నితీశ్ రానా(91)తో కలిసి 220 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో బౌండరీ ఢిల్లీ భారీ స్కోరందించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ సొంత గడ్డపై భారీ స్కోర్ కొట్టింది. మూడో ఓవర్లోనే పథుమ్ నిశాంక(11)ను అర్ష్‌దీప్ సింగ్ (1-49) ఔట్ చేసినా కేఎల్ రాహుల్(152 నాటౌట్), నితీశ్ రానా(91)లు క్రీజునంటుకుపోయారు. ఈ సీజన్‌లో అదరగొడుతున్న పంజాబ్ కింగ్స్ బౌలర్ల భరతం పట్టిన ఇద్దరూ పోటీపడి బౌండరీలతో విరుచుకుపడగా ఢిల్లీ స్కోర్ బోర్డు రాకెట్ వేగంతో పరుగులు పెట్టింది.

6, 4, 4 ,4, 6

బార్ట్‌లెట్ వేసిన 12వ ఓవర్లో రానా రెచ్చిపోయాడు. ఆరు బంతుల్ని 6, 4, 4 ,4, 6గా మలిచి 28 రన్స్ పిండుకోవడంతో పాటు అర్ధ శతకం సాధించాడు. అనంతరం అర్ష్‌దీప్ సింగ్‌ను రాహుల్ ఉతికేస్తూ 6, 4, 4 బాదగా స్కోర్ 190 దాటింది. కాసేపటికే యాన్సెన్ ఓవర్లో స్ట్రెయిట్ బౌండరీతో 47 బంతుల్లోనే రాహుల్ ఐపీఎల్‌లో ఆరో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయాన్ని చాహల్ విడదీసినా.. బౌండరీ లైన్ వద్ద క్యాచ్ అందుకున్నప్పటికీ కాలు రోప్‌కి తగలడంతో టీవీ అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. సెంచరీకి చేరువైన రానా మరో రన్స్ జోడించి అయ్యర్ సూపర్ క్యాచ్‌కు ఔటయ్యాడు. అనంతరం డేవిడ్ మిల్లర్(3 నాటౌట్) జతగా రాహుల్ ఢిల్లీకి 263 పరుగుల భారీ స్కోరందించాడు. 12, 51 పరుగుల వద్ద జీవనదానం లభించడంతో రెచ్చిపోయిన రాహుల్ పంజాబ్ ఊహించనంత స్కోర్ కట్టబెట్టాడు.

### సన్‌రైజర్స్ కెప్టెన్‌గా అతడే ఉండాలి'.. సెహ్వాగ్ సంచలన వ్యాఖ్యలు



ఆస్ట్రేలియా దిగ్గజం, సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ ఐపీఎల్-2026 సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. శనివారం జైపూర్ వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో కమ్మిన్స్ బరిలోకి దిగడం ఖాయమైంది. దీంతో తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఇషాన్ కిషన్ తన బాధ్యతలను కమ్మిన్స్‌కు అప్పగించే అవకాశముంది. అయితే కమ్మిన్స్ గైర్హాజరీలో సన్‌రైజర్స్ జట్టును కిషన్ అద్భుతంగా నడిపించాడు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో హైదరాబాద్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా కిషన్ విజయవంతమయ్యాడు. దీంతో కమ్మిన్స్ తిరిగొచ్చినా కెప్టెన్‌గా కిషన్‌నే కొనసాగించాలని చాలా మంది మాజీలు సూచిస్తున్నారు. కానీ టీమిండియా మాజీ క్రికెటర్ వీరేందర్ సెహ్వాగ్ ఇందుకు విరుద్ధంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఇషాన్ కిషన్ నుంచి కెప్టెన్సీ బాధ్యతలను కమ్మిన్స్ తిరిగి తీసుకోవాలని సెహ్వాగ్ తెలిపాడు. "కమ్మిన్స్ తిరిగి రావడం ఎస్ఆర్‌హెచ్‌కు అతిపెద్ద ప్లస్ పాయింట్. అయితే కిషన్ నుంచి కమ్మిన్స్ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకోవాలి. కమ్మిన్స్ జట్టుకు దూరంగా ఉండటం వల్లే ఇషాన్ కిషన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చారు. ఇప్పుడు కమ్మిన్స్ తిరిగి అందుబాటులోకి వచ్చాడు. కాబట్టి అతడే జట్టును నడిపించాలి. కమ్మిన్స్ ఒక సీనియర్ కెప్టెన్ మాత్రమే అద్భుతమైన ఆల్‌రౌండర్ కూడా. సరైన సమయంలో కమ్మిన్స్ అందుబాటులోకి వచ్చాడు. అయితే కమ్మిన్స్ ప్లేయింగ్ ఎలెవన్‌లోకి ఎవరి స్థానంలో వస్తాడన్నదే ప్రశార్థకంగా మారింది. అతడిని మధుశంక స్థానంలో తుది జట్టులోకి తీసుకునే అవకాశముంది" క్రిక్‌బజ్ షోలో సెహ్వాగ్ పేర్కొన్నాడు.

## స్పోర్ట్స్

### ఢిల్లీ క్యాపిటల్స్ అరుదైన ఘనత




పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఢిల్లీ క్యాపిటల్స్ అరుదైన ఘనత సాధించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును సమం చేసింది. ఐపీఎల్-2026లో ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటికి ఆరు మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. వీటిలో మూడు గెలిచిన ఢిల్లీ.. మూడు ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై విజయం సాధించిన అక్షర్ సేన.. ఆ తర్వాత ముంబై ఇండియన్స్‌నూ ఓడించింది. అనంతరం గుజరాత్ టైటాన్స్ చేతిలో ఒక్క పరుగు తేడాతో ఓడిన ఢిల్లీ.. చెన్నై సూపర్ కింగ్స్ చేతిలోనూ ఓటమి పాలైంది. ఆ తర్వాత ఆర్సీబీపై ఆరు వికెట్ల తేడాతో గెలిచిన ఢిల్లీ చివరగా సన్‌రైజర్స్ చేతిలో ఓటమిపాలైంది. తాజాగా సొంతమైదానం అరుణ్ జైట్లీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌ను ఢీకొట్టింది. ఇందులో భాగంగా ఢిల్లీ సారథి అక్షర్ పటేల్ టాస్ గెలిచాడు. తద్వారా ఐపీఎల్‌లో వరుసగా తొమ్మిదిసార్లు టాస్ గెలిచిన జట్టుగా ఢిల్లీ క్యాపిటల్స్.. సీఎస్కే, సన్‌రైజర్స్ రికార్డును సమం చేసింది.

ఐపీఎల్‌లో వరుసగా అత్యధికసార్లు టాస్ గెలిచిన జట్లు ఇవే

సన్‌రైజర్స్ హైదరాబాద్- 9 సార్లు (2015-16 సీజన్)
చెన్నై సూపర్ కింగ్స్- 9 సార్లు (2019)
ఢిల్లీ క్యాపిటల్స్- 9 సార్లు (2025-26 సీజన్)
చెన్నై సూపర్ కింగ్స్- 8 సార్లు (2018-19)
రాజస్తాన్ రాయల్స్- 8 సార్లు (2023).

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI :**TEL TEL / 2023/ 84132